వందేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం

1920 OCT.17 - 2020 OCT.17

100 YEARS OF INDIAN COMMUNIST PARTY

# ప్రజలతో కలసి స్వాతంత్ర్యం కోసం

(1920-1947)



PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

కమ్యూనిస్టు పార్టీ @ 100

# ప్రజలతో కలిసి స్వాతంత్ర్యం కోసం

**(1920-1947)**

రచన

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ**

అనువాదం

**ఎస్. వెంకట్రావు**

PSBH ప్రజాశక్తి బుక్‌హౌస్

*27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, రాఘవయ్యపార్కు వద్ద*

*విజయవాడ - 520 002. ఫోన్ : 0866 - 2577533*

**ప్రచురణ సంఖ్య** : 1663

**ప్రథమ ముద్రణ** : అక్టోబర్, 2020

**ప్రతులు** : 1000

వెల : ₹ 45/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ,

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

ISBN : 978-93-88566-66-7

149834

# పరిచయం

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి ఈ ఏడాదికి వందేళ్లు అవుతోంది. పార్టీ 1920 అక్టోబర్‌లో తాష్కెంట్‌లో స్థాపించబడింది. ఈ వందేళ్లలో పార్టీకి సంబంధించిన అనేక అంశాలు - దాని సిద్ధాంతం, కృషి, పోరాటాలు, ప్రజాసేవ, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, మన ప్రజల ప్రయోజనాలను కాపాడడం కోసం అది చేసిన పోరాటం మొదలైన వాటికి సంబంధించి వరుస ప్రచురణలు తీసుకురావాలనుకుంటున్నాం. వాటిలో ఇది మొదటిది.

పార్టీ జీవితంలోని కొన్ని ప్రధాన సంఘటనలను ఈ తొలి ప్రచురణలో మీ ముందుంచుతున్నాం. బ్రిటిష్ వలస వాద దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం జరిగిన భారత జాతీయోద్యమంలో పార్టీ కృషికి సంబంధించిన అంశాలను ఇందులో వివరించాం. ఇది సుమారు 1920-1947 మధ్య కాలాన్ని వివరిస్తుంది.

పీడితులనూ, దోపిడీకి గురయ్యేవారినీ, కార్మికులనూ, రైతాంగాన్నీ సమీక రించడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటాన్ని బలోపేతం చేయడానికి ఎలా కృషి చేసిందో ఈ చిన్న పుస్తకం వివరిస్తుంది. వర్గపోరాటాన్ని, సామాజిక సమస్యలపై పోరాటాన్ని జాతీయోద్యమంతో లింకు చేసిన విషయాన్ని విశదీకరిస్తుంది. అంతిమ లక్ష్యమైన సోషలిజాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల జీవన పరిస్థితుల్లో మార్పు కోసం వారిని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు సమీకరించారు. మన జాతీయోద్యమంలో ఇది ఒక విశిష్టమైన ధోరణి.

కార్మిక వర్గ, రైతాంగ ఉద్యమాలు ఎంత విస్తృత స్థాయిలో జరిగాయో పాఠకులు లోపలి పేజీల్లో చూస్తారు. ప్రజలు తమ జీవన పరిస్థితుల మెరుగుకోసం బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా ఎంత పెద్ద సంఖ్యలో సమ్మె, పోరాటాల్లోకి వచ్చారో గమనిస్తారు. ఈ ప్రజా పోరాటాలను కమ్యూనిస్టులు ప్రారంభించడమో, నిర్వహించడమో లేక

మద్దతివ్వడమో జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచంలోనే మొట్టమొదటి సమ్మె బొంబాయిలో కమ్యూనిస్టుల చొరవతో జరిగింది.

గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ జాతీయోద్యమంలో ప్రధాన శక్తిగా ఉంది. ఆ పార్టీ నాయకత్వంలోని ప్రధాన స్రవంతితో కమ్యూనిస్టు పార్టీ సంబంధాలు, సహకారంలో అనేక ఎగుడుదిగుడులు, మలుపులూ ఉన్నప్పటికీ బ్రిటిష్ పాలనను అంతమొందించాలన్న లక్ష్యానికి మాత్రం గట్టిగా కట్టుబడి పనిచేసింది. గాంధీతో సహా ఇతర జాతీయవాదులంతా భారత దేశానికి స్వయం పాలనాధికారం కావాలని కోరుతున్న సమయంలో కమ్యూనిస్టులు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న నినాదాన్ని మొదట లేవనెత్తారు.

అది కేవలం నినాదం కాదు.

కమ్యూనిస్టుల కృషిని సహించలేని బ్రిటిష్ పాలకులు వారిపై తొలినాళ్లలోనే, పార్టీ ప్రారంభం కాగానే దారుణంగా దాడులు చేశారు. అణచివేతకు దిగారు. దీని గురించి ఈ పుస్తకంలో పేర్కొన్న ఒక్క వాస్తవం స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుంది. 1943లో జరిగిన పార్టీ మొదటి మహాసభకు 138 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారందరూ అనుభవించిన జైలుజీవితం మొత్తాన్ని కలుపుకుంటే 414 సంవత్సరాలు. ఇదంతా కూడా మహాసభకు హాజరైన 138 మంది ప్రతినిధుల రికార్డు మాత్రమే. మొత్తం సభ్యులది కాదు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ, వారి నాయకులు, కార్యకర్తలు చావును సహితం లెక్కచేయకుండా చేసిన త్యాగాన్నీ, వారు ప్రదర్శించిన దేశభక్తినీ ఇది తెలియజేస్తుంది.

భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధి కీలకమైన అంశం సోషలిజం సాధించాలన్న లక్ష్యం, బోల్షివిక్ విప్లవం వల్ల వచ్చిన స్ఫూర్తి. కమ్యూనిస్టులను "విదేశీ ఏజెంట్లు" అనీ, "విదేశీయుల" ప్రోద్బలంతో పనిచేస్తున్నారనీ రకరకాల ఆరోపణలు చేశారు. ఈ తప్పుడు ప్రచారం అంతా కూడా కార్మికవర్గ అంతర్జాతీయతా స్ఫూర్తిని వమ్ముచేయడం కోసం, ఉమ్మడి శత్రువులైన వలసవాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా పీడిత ప్రజలు చేస్తున్న ఉమ్మడి పోరాటాలకు సంఘీభావం తెలపకుండా ఉండడం కోసం చేసిందే. దోపిడీ వ్యవస్థ నుండి మానవజాతి విముక్తి అనే విశ్వమానవత్వ లక్ష్యం ఆధారంగా పనిచేసే కమ్యూనిస్టులు తమ అంతర్జాతీయతా సంప్రదాయం పట్ల గర్విస్తారు. ఈ అంతర్జాతీయతా స్ఫూర్తితోనే ఆ కాలంలో బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ తమ స్వంత దేశంలో స్వంత ప్రభుత్వానికీ, దాని వలస పాలనకూ వ్యతిరేకంగా పోరాడిందన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి.

బ్రిటిష్ కమ్యూనిస్టులు భారత స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరిచారు. స్వాతంత్ర్య పోరాటం ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలకు మద్దతిచ్చారు.

పార్టీలో వివిధ సమస్యలపై జరిగిన అంతర్గత చర్చలు కూడా దాని చరిత్రలో భాగమే. ఈ పుస్తకం ఆ విషయాల జోలికి పోలేదు. అలాగే కొన్ని సమస్యలపై పార్టీ తీసుకున్న కొన్ని నిర్ణయాలను తరువాత వచ్చిన పార్టీ నాయకత్వం వివిధ దశల్లో సమీక్షించిన సందర్భాలున్నాయి. వాటి వివరాల్లోకి కూడా ఈ పుస్తకం వెళ్లలేదు. ఎవరైనా ఇంకా వివరమైన రాజకీయ అధ్యయనం చేయాలనుకుంటే వారికి ఈ వివరాలన్నీ ఇతర ప్రచురణల్లో దొరుకుతాయి.

ఇటువంటి చిన్న పుస్తకంలో వ్యక్తులందరూ చేసిన కృషిని గురించి ప్రస్తావించడం సాధ్యం కాదు. అటువంటి లోపాలు ఏవైనా ఉంటే అవి పూర్తిగా అనుకోకుండా చేసినవే. అయితే దాదాపు ఇందులో ప్రస్తావించిన అన్ని కాలాల్లో కూడా నాయకులుగా ఎదిగిన, ఎంతో పెద్ద కృషి చేసిన కమ్యూనిస్టు మహిళల పేర్లు ప్రస్తావించడంలో గ్యాప్ ఉందన్న విషయం గుర్తించాలి. చరిత్ర రాయడంలో ఇది బలహీనత. దీన్ని సరిచేయాలి.

ఈ పుస్తకంలో పేర్కొన్న చాలా అంశాలు ఇంతకు ముందు ప్రచురించబడ్డాయి. పుస్తకం చివరిలో ఆ రిఫరెన్స్ జాబితా ఇవ్వడం జరిగింది. దొరికిన సమాచారాన్ని సేకరించి, వివిధ అంశాలను గుదిగుచ్చి ఇవ్వడమే ఇక్కడ జరిగింది. దీనివల్ల పార్టీ చరిత్రను కొంత కాలక్రమానుగతంగా, కొంత విషయానుగతంగా పాఠకుని ముందుంచడానికి వీలయింది.

ఈ ప్రచురణ గుదిగుచ్చడానికి చాలా మంది కామ్రేడ్స్ తోడ్పడ్డారు. మరీ ముఖ్యంగా మేము సుభోద్ వర్మ, అరుణ్ కుమార్, అశోక్ ధావలే, టి.కె. ఆనంది, సుజాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

**బృందా కరత్,**

నవంబర్, 2019

# భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం, 1920

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ చరిత్రలో తొలి రెండు దశాబ్దాలను గమనిస్తే పార్టీలో వివిధ ఉద్యమాల ప్రభావం, విప్లవోద్యమ ప్రభావాల మేలు కలయిక మనకు కనిపిస్తుంది. వివిధ దశల్లో వేర్వేరు విప్లవ ఉద్యమాలకు చెందినవారు, పోరాటయోధులు పార్టీలో చేరారు. పంజాబ్‌కు చెందిన గదర్ వీరులు, భగత్ సింగ్ సహచరులు, బెంగాల్ విప్లవకారులు, బొంబాయి మద్రాస్ ప్రెసిడెన్సీలోని సమరశీల కార్మిక వర్గ పోరాట యోధులు ఆంధ్ర, కేరళ తదితర రాష్ట్రాలలోని సామ్రాజ్యవాద వ్యతిరేక అతివాద కాంగ్రెస్ వాదులు.... ఇలా దేశవ్యాప్తంగా బ్రిటిష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న మెరికల్లాంటి యోధులు పార్టీలో చేరడం ద్వారా పార్టీని బలోపేతం చేశారు. ఆ రకంగా పార్టీ దేశంలోని కార్మికవర్గం, రైతాంగం, సామాజికంగానూ ఆర్థికంగానూ అణచివేతకు గురౌతున్న బడుగువర్గాల ప్రయోజనాల కోసం పాటుపడే ప్రతినిధిగా చారిత్రాత్మక భారతస్వాతంత్ర్య సంగ్రామంలో ప్రత్యామ్నాయ సోషలిస్టు ఆశయాలతో, అతివాద భావాలతో పోరాడే సంస్థగా ఆవిర్భవించింది.

పార్టీ ఆవిర్భవించిన తొలినాళ్ళలో అప్పటి సోవియెట్ రష్యా ప్రధాన కేంద్రంగా పనిచేసిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ – 'కొమింటర్న్' ఎంతో తోడ్పాటు నందించింది. ఆనాడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిసు పార్టీలు ఆవిర్భవించాయి. వాటన్నింటికీ 'కొమింటర్న్' మార్గనిర్ధేశనం చేసేది. ఇవాళ అటువంటి అంతర్జాతీయ కమ్యూనిస్టు కేంద్రం లేకపోవడం, శ్రామిక వర్గ అంతర్జాతీయత కన్నా ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ఆయా సార్వభౌమ దేశాల్లో తమదైన

మార్గంలో మార్క్సిస్టు కృషి చేసుకుంటాపోవడం అనుభవంలో చూస్తున్న నేటితరం పాఠకులకు ఇది కొంత ఆశ్చర్యం కలిగించే అంశమే. భారత కమూనిస్టు పార్టీకి సోవియెట్ రష్యా సహకారం అందించడానికి ప్రత్యేక నేపథ్యం ఉంది. భారతదేశ స్వాతంత్ర్య సాధనకోసం కొనసాగుతున్న జాతీయ విముక్తి పోరాటానికి అండగా నిలుస్తూనే ఈ విముక్తి పోరాటం దేశంలో సోషలిస్టు సమాజం సాధించాలనే అంతిమ లక్ష్యం కూడా సాధించాలనేది సోవియెట్ తోడ్పాటు వెనుకవున్న అసలు ఉద్దేశ్యం, మన దేశానికి స్వాతంత్ర్యం రాకమునుపు కమ్యూనిస్టు పార్టీకి, కొమింటర్న్‌కు మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలకు పునాది అది. దేశానికి స్వాతంత్ర్యం రావడంతో పరిస్థితులలో మార్పులు వచ్చాయి. ఆ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీకి, కొమింటర్న్‌కు ఉన్న సంబంధాలలో కూడా ఆ మార్పులు చోటు చేసుకున్నాయి. 1919 నుండి 1943 వరకు కొమింటర్న్ ఉనికిలో ఉంది. తదనంతరం అది రద్దయింది.



ఎం ఎన్ రాయ్



ఎంపిటి ఆచార్య



అబనీనాథ్ ముఖర్జీ

## ఆవిర్భావ సమావేశం

1920 అక్టోబర్ 17న ఏడుగురు సభ్యుల బృందం ఒకటి తుర్కిస్థాన్ రిపబ్లిక్ ఆఫ్ సోవియట్ యూనియన్ రాజధాని నగరమైన తాష్కెంట్‌లో 'భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం సమావేశమయింది. వివిధ సామాజిక నేపథ్యాల నుండి వచ్చిన ఈ బృందం ఆలోచన మాత్రం ఏకరీతిన ఉండింది. వీరంతా ప్రపంచంలో తొట్టతొలిగా ఆవిర్భవించిన కార్మిక శ్రేయోరాజ్యం, 1917 అక్టోబర్ మహత్తర విప్లవాలతో ఉత్తేజం పొందినవారు, భారతదేశాన్ని బ్రిటిష్ దాస్యశృంఖలాలనుండి విముక్తం చెయ్యాలనే తపనకలవారు. బ్రిటిష్ వలస పాలన నుండి భారతదేశాన్ని విముక్తం చేయడంతో పాటు దేశంలో సోషలిజం పెట్టుకున్నారు.

యం.యన్. రాయ్, ఎవిలీన్ ట్రెంట్ – రాయ్, అబనీనాథ్ ముఖర్జీ , రోసా ఫెంటింజోవ్, మొహమద్ షఫీఖ్, యం.పి.బి.టి ఆచార్య – వీరే నాడు తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు ఆవిర్భావం కోసం పనిచేసిన ఏడుగురు బృంద సభ్యులు. ఎవిలీన్ ట్రెంట్ – రాయ్ అమెరికన్ కమ్యూనిస్టు, యం.ఎన్.రాయ్ జీవితభాగస్వామి. రోసాఫిటింజోవ్ రష్యన్ కమ్యూనిస్టు. అబనీనాథ్ ముఖర్జీని వివాహమాడిన వ్యక్తి.

మొహమద్ షఫీఖ్‌ను  పార్టీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసి మానవాళి ఎదుర్కొంటున్న సకల పీడనల నుండి విముక్తి గావించాలి, శ్రామిక వర్గ అంతర్జాతీయతకు కట్టుబడి ఉండాలి అన్న ప్రధాన సూత్రాలకు పార్టీ కట్టుబడి ఉంటుందని తీర్మానించారు. తమ లక్ష్యాలను సాధించడానికి వాళ్ళు ఆ రోజుకి ఎలాంటి ఎత్తుగడల వ్యూహాన్నీ రూపొందించుకోలేదు. కానీ భారతదేశంలోని నిర్ధిష్ట పరిస్థితులకు అనుగుణంగా తమ లక్ష్యసాధనకు పనిచెయ్యాలని నిర్ణయించుకున్నారు.

కేవలం వేళ్ళమీద లెక్కించగలిగినంత తక్కువ మంది వ్యక్తుల ప్రమేయంతో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించడం ఆశ్చర్యపోయేంత విషయమేమీకాదు. 1921 జూలై నెలలో షాంఘైలో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. మావో జెడాంగ్ సహా మొత్తం 17 మంది ప్రతినిధుల సమావేశంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. ఇండో చైనా కమ్యూనిస్టు పార్టీ 20 మంది సభ్యుల బృందంతో 1930లో ఆవిర్భవించింది. ఆనాటికి ఇండోచైనాను తమ వలస భూభాగంగా మార్చుకుని పరిపాలిస్తున్న ఫ్రాన్స్‌లో మార్క్సిజాన్ని ఆలంబనగా చేసుకున్న కొద్దిమంది వ్యక్తులే ఇండోచైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి కృషి చేశారు. (తదనంతర కాలంలో వియత్నాం, కాంబోడియా, లావోస్ కమ్యూనిస్టు పార్టీల ఆవిర్భావం – ఆ ఐక్య ఇండోచైనా కమ్యూనిస్టు పార్టీ సహకారంతోనే జరిగింది.)

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ కాలంలో విదేశీయులు కూడా పార్టీ సభ్యులుగా ఉండడంలో కూడా వింత ఏమీలేదు. జారిస్టు రాజరిక పరిపాలన నుండి రష్యాను విముక్తం చేసిన బోల్షవిక్  విప్లవం లక్షలాది మంది వ్యక్తులకు, అనేక సమూహాలకు ప్రేరణనిచ్చింది. బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ ఇటువంటి ప్రేరణనుండే తమ సొంత ప్రభుత్వాన్ని, బ్రిటిష్ మహాసామ్రాజ్యాన్ని ఎదిరించి భారతదేశంలో జరుగుతున్న జాతీయ విమోచనోద్యమానికి బహిరంగంగానే మద్దతు పలికింది.

యం.ఎన్.రాయ్, అబని ముఖర్జీ, యం.పి.బి.టి ఆచార్యులు అప్పటికే భారతదేశం వెలపల నుండే కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమై ఉన్నారు. భారతదేశంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించేదానికి ఇతరేతర దేశాలనుండి మద్దతు కూడగట్టాలని కాంక్షిస్తున్నారు. ఈ ముగ్గురూ 1920 జూలై నెలలో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ మహాసభకు హాజరయ్యారు. భారతదేశంలో ఖిలాఫత్ ఉద్యమం విఫలమయ్యాక బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలకు మద్దతు కూడగట్టాలనే ఆలోచనతో మొహమ్మద్ షఫీఖ్, మొహమ్మద్ ఆలీలు ముజాఫర్‌ల అవతారం ఎత్తి తాష్కెంట్ చేరుకున్నారు. మొదటి

ప్రపంచం యుద్ధంలో ఒట్టమాన్ సామ్రాజ్యం పరాజయం పాలయ్యాక అనేకమంది ముజాహిర్‌లు బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో మమేకం కావడానికి దేశం విడిచివెళ్ళారు.

ఆ రకంగా తాష్కెంట్‌లో భారతకమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి భారత జాతీయ విముక్తి పోరాటము, మహత్తర అక్టోబర్ సోషలిస్ట్ విప్లవమూ – రెండూ ప్రేరణగా నిలిచాయి.

ఇప్పుడు పై రెండు ధోరణులను మరింత నిశితంగా పరిశీలిద్దాం

## స్వాతంత్ర్య సమర స్ఫూర్తి

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికంటే కొద్ది ముందు కాలం నుండి దేశంలో ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నాయి. కార్మికులు, రైతాంగం పెద్ద ఎత్తున నిరసనలు, సభలు, సమ్మెల లో పాలు పంచుకోవడం ద్వారా ఆ ఉద్యమాలు నానాటికీ బ్రిటీష్ వ్యతిరేకతను సంతరించుకోసాగాయి. 1905–1918 మధ్యకాలంలో దేశంలోని అనేక ప్రాంతాలలో రైతులు యుద్ధనిధికి విరాళాలు ఇవ్వనిరాకరించారు. బ్రిటీష్ సైన్యంలో చేరడానికి నిరాకరిస్తూ శిక్షణా శిబిరాల నుండి వైదొలిగారు.

యునైటెడ్ ప్రావిన్స్‌లోని తూర్పుజిల్లాలు, బెంగాల్, చంపారన్ తో పాటు బీహార్‌లోని మరికొన్ని జిల్లాలు, గుజరాత్‌లోని ఖేదా జిల్లా అలానే ఆంధ్రా, మద్రాస్ ప్రావిన్స్‌లర్ కొన్ని జిల్లాల్లో (గుంటూరు తదితర జిల్లాలు) రైతులు పన్ను చెల్లింపు నిరాకరణోద్యమంలో భాగస్వాములయ్యారు.

ఇటువంటి నేపథ్యంలో 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. ఇది జాతీయోద్యమంలో కొన్ని కీలకమైన పరిణామాలకు దారితీసింది. దేశంలో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తాయి. 1920లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి) ఆవిర్భవించింది. జాతీయోద్యమంలో మధ్యేవాదులు , అతివాదులుగా ఉన్న అనేకమంది ఈ కార్మిక సంఘ నాయకత్వంలోకి వచ్చారు. ఏఐటియుసి తొలి అధ్యక్షునిగా లాలాలజపతిరాయ్ పనిచేశారు. కమ్యూనిస్టులు తమ సైద్ధాంతిక నిబద్ధతతో, వాస్తవిక కార్యాచరణతో అనతికాలంలోనే కార్మికవర్గానికి ఆకట్టుకున్నారు. కార్మిక సంఘాలకు అవసరమైన నమ్మకమైన, నిజమైన నాయకులుగా గుర్తింపబడ్డారు. ప్రజాదరణ కలిగిన కార్మిక ఉద్యమ నాయకులుగా ఎదిగారు. కార్మిక సంఘాల్లో కమ్యూనిస్టులు చురుకైన పాత్ర నిర్వహించడం మూలంగా కార్మికవర్గం జాతీయోద్యమంలోకి పెద్ద ఎత్తున కలిసివచ్చింది.

బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమం తాము ఆశించినంత ఊపుగా సాగడం లేదనే అసంతృప్తితో మహారాష్ట్ర, బెంగాల్ ప్రాంతాలలో చిన్న చిన్న విప్లవ సభ్యుల బృందాలు, రహస్య సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఈ సంస్థలు, బృందాలు సాయుధ వ్యక్తిగత

దాడుల మార్గాన్ని ఎంచుకున్నాయి. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సాయుధదాడులు, బాంబు పేలుళ్ళు, ఆయుధాల అపహరణ వంటి కార్యకలాపాలకు పాల్పడేవి.

బ్రిటిష్ పాలకులపట్ల పెరుగుతున్న అసంతృప్తి, వలసపాలన వ్యతిరేక ఉద్యమ వ్యాప్తి – ఈ రెండింటి నేపథ్యంలో 1920లో మహాత్మా గాంధీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపునిచ్చారు. అలాగే ఖలీఫాను పునఃప్రతిష్ఠించాలన్న ముస్లింల డిమాండ్‌ను గాంధీ బలపరిచారు. బ్రిటిష్ పాలకులు మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఓటమిపాలైన ఒట్టోమాన్ సుల్తాన్‌ను – ఇతనినే ఖలీఫాగా ముస్లింలు గుర్తిస్తారు. పదవీచ్యుతుడిని చేస్తారు. ముస్లింలలో ఉన్న బ్రిటిష్ వ్యతిరేకభావాలను మరింత ఎగసనదోసేందుకు ఉపయోగపడింది ఈ చర్య. భారతీయ ముస్లింలలో బ్రిటిష్ పాలకులపట్ల ఈ అంశం మీద తీవ్ర వ్యతిరేకత ఉండింది. ఈ కారణానే ముస్లింల నాయకత్వంలో 'ఖిలాఫత్' ఉద్యమం ఉధృతంగా మొదలైంది. అనేకమంది ముస్లింలు దేశాంతరాలుపోయి మరీ ఆయా భూభాగాల నుండి భారతదేశంలోని బ్రిటిష్ వలసపాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇలా దేశాంతరాలు పట్టి పోయినవారినే అరబ్బీ భాషలో 'ముజాహిర్లు' అని పిలిచేవారు. ఈ ముజాహిర్లలో అనేకమంది మధ్య ఆసియాలోని భూమార్గం ద్వారా టర్కీ చేరుకునే క్రమంలో సోవియట్ కమ్యూనిస్టులు, ఇతర భారతీయ విప్లవకారులను కలిశారు. వారిలో పెచ్చుమంది కమ్యూనిస్టులుగా మారారు.

## మహత్తర అక్టోబర్ విప్లవం ప్రభావం

1917 లో రష్యాలో మహత్తర అక్టోబర్ విప్లవం జయప్రదం కావడం, కార్మిక శ్రేయోరాజ్యం ఏర్పడడం ప్రపంచ దేశాలను పెద్ద కుదుపునకు గురిచేశాయి. ఆనాటికి సమాచార, రవాణ వ్యవస్థలు నేడు ఉన్నతంగా అభివృద్ధి చెందిన స్థాయిలో లేవు. కాబట్టి కాస్త అటూఇటూగా ప్రపంచంలోని అనేక దేశాలమీద అక్టోబర్ కార్మిక వర్గ విప్లవం ప్రభావం పడింది. ప్రజాకంఠక రాజరిక పరిపాలనను అతి సామన్య ప్రజానీకం కూలగొట్టి నేలమట్టం చేసిన ఘటన అప్పటిదాకా ఉన్న ప్రపంచ మానవాళి చరిత్రలోనే లేదు. అలాంటి తిరుగుబాటు సాధ్యమే అన్న ఆలోచన ఆనాడు సామాన్య ప్రజానీకానికి ఊహకైనా అందని విషయం . మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవం భారత్ సహా ఆనాటి అనేక వలసదేశాల ప్రజానీకంలో ఒక నమ్మకాన్ని పాదుకొల్పింది. రవి అస్తమించని బ్రిటిష్ మహాసామ్రాజాన్ని ఓడించడం సాధ్యంకానిపని అన్న భావన తుత్తనీయలైపోయేలా చేసింది.

1905 –1907 మధ్యకాలంలో బ్రిటిష్ పాలకుల తీవ్ర అణచివేత కారణంగా కొన్ని భారతీయ విప్లవకారుల బృందాలు దేశం విడిచి లండన్, పారిస్, బెర్లిన్‌లకు

తరలివెళ్ళాయి. ఆ బృందాలకు రష్యన్  కమ్యూనిస్టు పార్టీ సంబంధాలు ఉన్నాయి. బెర్లిన్ తరలివెళ్ళిన విప్లవకారుల బృందంలో వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ, భూపేంద్రనాథ్ దత్త, మొహమద్ బర్కాతుల్లా, నళీనీ గుప్త తదితరులు ఉన్నారు.

అక్టోబర్ విప్లవం విజయవంతమైన తరువాత కాలం నుండి ఇలా విదేశాలలో తలదాచుకున్న విప్లవకారులకు, బోల్షవిక్కులకు మధ్య సంబంధాలు మరింత చురుకుగా సాగాయి. వీరిలో చాలామంది 1918–1922 మధ్యకాలంలో సోవియట్ రష్యాను సందర్శించారు. లెనిన్ తదితర నాయకులను కలిశారు. మాస్కో, పెట్రోగాడ్, బకూ, తాష్కెంట్ తదితర నగరాలలో పర్యటించి విప్లవానంతరం అక్కడ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, పథకాలు, అభివృద్ధి కార్యకలాపాలను ప్రత్యక్షంగా  పరిశీలించి ఎంతగానో ప్రభావితం అయ్యారు. అక్టోబర్ విప్లవానంతరం ఏర్పడిన కార్మిక శ్రేయోరాజ్యం పీకనులమడానికి 13 పెట్టుబడిదారీ దేశాలు కూటమి కట్టి రష్యా మీద దండెత్తాయి. అంతటి తీవ్ర ఉపద్రవాన్ని ఎదుర్కొంటూనే బోల్షివిక్ ప్రభుత్వం రష్యన్ ప్రజానీకం జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి చేపట్టిన కృషి ఈ ప్రవాసీ విప్లవకారులను ఆకట్టుకుంది.

భారతీయ పర్యాటకులు రష్యానుండి తిరిగివచ్చిన తరువాత అక్కడి పరిస్థితులను వివరిస్తూ కరపత్రాలు ముద్రించి, మార్క్సిస్టు –లెనినిస్టు ఆలోచనలవైపు ప్రజలను ఆకర్షించడానికి పెద్ద ఎత్తున కృషిచేశారు. మధ్య ఆసియాలో జాతుల సమస్య పట్ల సోవియట్ రష్యా అనుసరిస్తున్న విధానాలను వివరిస్తూ మొహమ్మద్ బర్కతుల్లా పర్షియన్ భాషలో ప్రచురించి పంపిణీ చేసిన కరపత్రం ప్రభావంతో దాదాపు 200 మందికి పైగా ముజాహిర్లు తమ బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి మద్దతు కూడగట్టడానికి సోవియట్ – ఆఫ్ఘన్ సరిహద్దు మార్గం గుండా రష్యాలోకి ప్రవేశించారు.  సోవియట్ అధికారులు వారికి తగిన సహాయసహకారాలు అందించారు. వీరిలో చాలామంది స్వదేశానికి మరలివచ్చారు. ఒక 30 మంది మాత్రం అక్కడే ఉండిపోయారు. 'ఇండియన్ రివల్యూషనరీ అసోసియేషన్' కు తాష్కెంట్‌లో ఒక శాఖగా ఏర్పడి వలసపాలకుల వ్యతిరేక పోరాటం కొనసాగించారు. వీరిలోనుండి 25 మంది కమ్యూనిస్టు భావజాలం వైపు మొగ్గారు. 1921 లో తూర్పు మాస్కోలో ప్రారంభించిన 'కమ్యూనిస్టు యూనివర్సిటీ'లో చేరారు.

సంతోఖ్ సింగ్, రతన్ సింగ్ తదితర విప్లవకారులు 1913లో అమెరికాలో 'గదర్' పార్టీని స్థాపించారు. అయితే వీరిమీద తీవ్ర నిఘా కొనసాగిన కారణంగా ఇతరేతర దేశాల్లోని విప్లవకారులతో సంబంధాలు నెలకొల్పుకోలేకపోయారు. కరీబియన్, పిజీ దీవులలోని పొలాల్లో పనిచేస్తుండే భారతీయకూలీలకు వీని కరపత్రాలు

చేరేవి. 1917 తరువాత – రష్యాలో కమ్యూనిస్టు విప్లవం విజయవంతం అయ్యాక –గద్దర్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులు రష్యా వెళ్ళి కమ్యూనిస్టు శిక్షణ పొందారు. కొయగాటమారు ఉదంతం తరువాత గదర్‌పార్టీ ప్రయత్నించిన తిరుగుబాటును క్రూరంగా అణగదొక్కేశారు.

వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ నాయకత్వంలో బెర్లిన్‌లో పనిచేస్తున్న విప్లవకారుల బృందం ఎట్టకేలకు 1921 లో మాస్కో చేరుకుని కొమింటర్న్ నాయకత్వాన్ని కలుస్తుంది. భారతదేశం ముందు బ్రిటిష్ వలసపాలన నుండి విముక్తం కావాలి. ఆ తరువాతే కమ్యూనిస్టు పార్టీని స్థాపించుకోవచ్చు. కాబట్టి కొమింటర్న్ నాయకత్వం భారతదేశ విమోచనోద్యమ పోరాటానికి తగిన సాయం చెయ్యాలని, యం.యన్.రాయ్ నాయకత్వంలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీని గుర్తించకూడదని కొమింటర్న్‌ను కోరింది. ఈ అంశం మీద కొమింటర్న్ నియమించిన కమిషన్ అన్ని పక్షాల అభిప్రాయాలను విన్న తరువాత తాష్కెంట్‌లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ బృందాన్ని – కమ్యూనిస్టు పార్టీగా గుర్తించాలని నిర్ణయించింది.

అయితే కమ్యూనిస్టు పార్టీ ఎటువంటి ప్రణాళికనూ ఖరారు చెయ్యకపోవడం మూలంగా కొమింటర్న్‌కు అనుబంధ సంస్థగా గుర్తింపు పొందలేకపోయింది. కొమింటర్న్‌కు అనుబంధం కావాలనుకున్న ఏ కమ్యూనిస్టు పార్టీ అయినా రాజకీయ కార్యక్రమం – ప్రణాళిక రూపొందించుకొని ఉండాలి అనేది మొదటి షరతు. ఈ షరతు కారణంగా యం.యన్.రాయ్ సారథ్యంలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ కొమింటర్న్‌కు అధికారికంగా అనుబంధ సంస్థ కాలేకపోయినప్పటికీ భారతదేశంలో అప్పుడప్పుడే ఏర్పడుతున్న చిన్నాచితకా కమ్యూనిస్టు బృందాలకు మార్క్సిస్టు అవగాహన అందించే కీలకమైన కృషిని కొనసాగించింది.

## 1920 ఎందుకు, 1925 ఎందుకు కాదు

భారతకమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరానికి సంబంధించి ఒక వివాదం ఉందనే విషయం పాఠకుల గమనంలో ఉండి ఉండవచ్చు. భారత కమ్యూనిస్టు పార్టీలో 1964 లో ఏర్పడిన చీలిక పర్యవసానంగా అవతరించిన భారత కమ్యూనిస్టు పార్టీ – మార్క్సిస్టు 1920 అక్టోబర్‌లో తాష్కెంట్ సమావేశంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావాన్ని పార్టీ అవిర్భావ సంవత్సరంగా పరిగణిస్తుంది. అయితే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాత్రం వివిధ కమ్యూనిస్టు బృందాలే 1925 డిసెంబర్‌లో కాన్పూర్‌లో సమావేశమై ఆమోదించిన తీర్మానం ప్రాతిపదికగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం 1925 వ సంవత్సరంగా పరిగణిస్తుంది.

చాలామంది ఈ అంశాన్ని అనవసర రాద్ధాంతంగా భావించవచ్చు. కానీ

సిపిఐ (యం) తీసుకున్న వైఖరి చారిత్రకంగా సబబైనది. 1920లో తాష్కెంట్‌లో ఆవిర్భవించిన పార్టీ ఎలాంటి ప్రణాళికను రూపొందించకపోవడం, తద్వారా కొమింటర్న్‌కు సాంకేతికంగా అనుబంధం కాకపోవడం కారణాలరీత్యా సిపిఐ 1920 ను కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరంగా గుర్తించడం లేదు. ఆ వాదనకు వస్తే 1925లో కాన్పూర్‌లో జరిగిన సదస్సు కూడా ఎలాంటి ప్రణాళికను రూపొందించలేదు. ఆ కారణానే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కు అనుబంధ సంస్థ కాలేకపోయింది. అలాంటప్పుడు 1925 ను కూడా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరంగా గుర్తించలేం కదా!

అయితే 1920లో తాష్కెంట్‌లో సమావేశమైన ప్రతినిధులు భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అనువుగా ఇక్కడి కమ్యూనిస్టు బృందాలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం, వలసపాలకుల తీవ్ర ఆంక్షలు - నిర్బంధాల నడుమనే దేశంలో మార్క్సిస్టు సిద్ధాంత వ్యాప్తికి కృషిచెయ్యడం, జాతీయ విమోచనోద్యమానికి సంబంధించిన నూతన అవగాహనతో భారతజాతీయ కాంగ్రెస్‌కు ఒక డాక్యుమెంటు సమర్పించడం తదితర కార్యకలాపాల రీత్యా 1920 నే భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరంగా సిపిఐ (యం) పరిగణిస్తుంది. మధ్య ఆసియా భూభాగం నుండి ఈ ప్రవాస కమ్యూనిస్టు లు భారతదేశంలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఇతర ప్రజాసంఘాలతో తమ కృషిని కొనసాగించారు.

ఆ రకంగా 1920లో కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడిన బృందం 1920-25 మధ్యకాలంలో పరిమితంగా అయినప్పటికీ భారతదేశంలో ప్రభావవంతమైన కృషి చేసింది. ఈ కాలంలోనే పార్టీ తన తొలిప్రణాళికను విడుదలచేసింది. ఈ కాలంలోనే బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై వివిధ కుట్రకేసులు, రాజద్రోహనేరాలూ మోపింది. ఈ చరిత్రాక కారణాలరీత్యానే 1920 వ సంవత్సరాన్నే కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరంగా సిపిఐ(యం) పరిగణిస్తుంది. 1920 నాటి పార్టీ ఆవిర్భావ బృందం చేసిన కృషి ఏమిటో తరువాయి అధ్యాయంలో వివరంగా తెలుసుకుందాం!

# భారతదేశంలో కమ్యూనిస్టు బృందాలు, బ్రిటిష్ పాలకుల నిర్బంధాలు

**సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం తొలుత ముందుకు తెచ్చింది కమ్యూనిస్టులే**

కమ్యూనిస్టు ఆవిర్భావం యొక్క తొలిప్రభావం ఏడాది తిరిగే లోపే జాతీయోద్యమ పోరాటం మీద పడింది. 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు కమ్యూనిస్టు పార్టీ తన ప్రణాళికను బహిరంగ లేఖరూపంలో పంపింది. తదనంతరం 1922లో గయలో జరిగిన కాంగ్రెస్ సదస్సులోనూ ఈ లేఖ పంపిణీ చెయ్యబడింది. సంపూర్ణ స్వాతంత్ర్య నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ అందుకోవాలని, బహిరంగంగా పిలుపునివ్వాలని ఆ లేఖ ద్వారా డిమాండు చేసింది. బ్రిటీష్ వలస పాలననుండి 'సంపూర్ణ స్వాతంత్ర్యం' కావాలనే డిమాండ్ ముందుకు రావడం అదే ప్రథమం.

కానీ కాంగ్రెస్ పార్టీ అప్పటికి అలాంటి డిమాండు చెయ్యడానికి సంసిద్ధంగా లేదు. 'హోమ్‌రూల్' (స్వపరిపాలన) డిమాండుకు మాత్రమే పరిమితం అయ్యింది. అప్పటినుండి దాదాపు ఎనిమిదేళ్ళ తరువాత 1929లో లాహోర్ సదస్సులో 'స్వరాజ్యం' అనే డిమాండును అందుకుంది. యం.యన్.రాయ్, ముఖర్జీలు ఇరువురూ కమ్యూనిస్టు పార్టీ తరపున విడుదలచేసిన బహిరంగలేఖ ఆధారంగా మౌలానా హస్రత్ మొహానీ అనే ప్రతినిధి విదేశీపరిపాలన నుండి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధిస్తేనే స్వరాజ్యం సాధించినట్లు అన్న తీర్మానాన్ని కాంగ్రెస్ సదస్సులో ప్రవేశపెట్టాడు. స్వామి కుమారనంద కూడా దాదాపు ఇదే రీతిన మరో తీర్మానాన్ని ప్రతిపాదించాడు. వీళ్ళిద్దరూ అప్పటికే సోషలిస్టు భావాలతో ప్రభావితమైనవారు. తదనంతర కాలంలో మొహానీ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. ఆ రోజున గాంధీ ఈ రెండూ 'ఆచరణ సాధ్యం కానివని' త్రోసిపుచ్చారు.

'సంపూర్ణ స్వరాజ్యం' నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ కన్నా చాలా ముందుగా రూపొందించడంద్వారా స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ ఎంత ముందుచూపుతో పనిచేసిందో అర్థంచేసుకోవచ్చు. భారతదేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ ఊహకైనా అందని రోజుల్లోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ సంవత్సరంలోనే 'సంపూర్ణ స్వరాజ్యం' అన్న నినాదాన్ని ముందుకు తెచ్చింది. కమ్యూనిస్టు పార్టీ ఎంతో గర్వించదగ్గ విషయం ఇది. దేశంలో కార్మికవర్గం, రైతాంగం ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారానికి పూనుకోవడం ద్వారా ఆయా తరగతులను స్వాతంత్ర్య పోరాటంలోకి పెద్దఎత్తున సమీకరించాలి అని అందుకు తగినట్లుగా కాంగ్రెస్ పార్టీ తన ప్రణాళికను సవరించుకోవాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. "కార్మిక సంఘాల కనీసకోర్కెలను కాంగ్రెస్ పార్టీ తన కోర్కెలుగా మలుచుకోవడం, రైతు సంఘాల న్యాయమైన కోర్కెలను తన కోర్కెలుగా మలుచుకుంటే కాంగ్రెస్ పార్టీ ఎదురులేని శక్తిగా మారుతుంది. కాంగ్రెస్ పార్టీ తమ భౌతిక ప్రయోజనాల కోసం కూడా పోరాడుతుంది అన్న నమ్మకం కలిగిన రోజున దేశంలో ఉన్న కష్టజీవులు, కార్మికులు, రైతులూ మొత్తంగా మెజారిటీ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడతారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి పోరాడతారు. కాంగ్రెస్ పార్టీ తక్షణం రైతాంగం – కార్మికవర్గం పక్షాన నిలబడాలి" అని కమ్యూనిస్టు పార్టీ హితవు పలికింది.



మౌలానా హర్షత్ మొహాని

కమ్యూనిస్టు పార్టీ సందేశాన్ని ముందుపీఠికి తీసుకురావడానికి మద్రాస్ కమ్యూనిస్టు బృందానికి నాయకుడుగా ఉన్న సింగారవేలు చెట్టియార్ 1922లో గయలో జరిగిన కాంగ్రెస్ సదస్సుకు హాజరై తాను కమ్యూనిస్టునని ప్రకటించి మరీ ఈ కాంగ్రెస్ సదస్సు 'సంపూర్ణ స్వరాజ్యం' నినాదాన్ని ఆమోదిస్తూ తీర్మానం చెయ్యాలని కోరాడు.

1922–24 మధ్యకాలంలో 'వాన్‌గార్డ్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్' పేరిట యం.యన్.రాయ్ బెర్లిన్ నుండి తొలి అధికారిక కమ్యూనిస్టు పత్రికను వెలువరించాడు. ఈ పత్రిక ద్వారా భారతదేశంలో కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి కృషిజరిగింది. కమ్యూనిస్టు ప్రచారం తమ పాలనకు ఎలాంటి ముప్పు తేనున్నదో గ్రహించిన బ్రిటిష్ పాలకులు ఈ ప్రతిక మీద నిషేధం విధించి దేశంలోకి రాకుండా చూశారు.

1925–1927 మధ్యకాలంలో యం.యన్ రాయ్ తన ఉద్యమ సహచరులతో కలిసి 'మాస్ ఆఫ్ ఇండియా' పత్రికను వెలువరించి భారతదేశంలోకి దొంగచాటుగా పంపి రహస్యంగా పంపిణీ అయ్యేలా చూశారు.

అదే సమయంలో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో కమ్యూనిస్టు గ్రూపులు ఆవిర్భావించాయి. కార్మికుల, రైతుల, ఇతర తరగతుల ప్రజానీకం సమస్యలమీద ఆందోళనా – పోరాటాలు నిర్వహిస్తూ సొంతంగా కొన్ని ప్రచురణలు తెచ్చి కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి కృషిచేశాయి. వీరంతా గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా ఉన్న బొంబాయిలో ఎస్.ఎ.డాంగే నాయకత్వంలో ఒక కమ్యూనిస్టు బృందం పనిచెయ్యసాగింది. యస్.వి. ఘాటే, కె.యం. జోగేకర్, ఆర్.ఎస్. నింబకర్ తదితరులు ఈ బృందంలో పనిచేశారు. 1923నుండి 'సోషలిస్టు' పత్రిక వెలువరించి ప్రధానంగా బొంబాయి, షోలాపూర్‌లలోని మిల్లు కార్మికులలో కమ్యూనిస్టు కృషి చేపట్టారు.

కలకత్తాలో ముజఫర్ అహ్మద్ ఒక కమ్యూనిస్టు బృందానికి నాయకత్వం వహించి నడిపారు. ప్రముఖ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం ఈ బృందంలో సభ్యుడిగా ఉండేవాడు. 'గణవాణి' పేరిట ఒక ప్రతిక నడిపారు.

మద్రాసునుండి సింగారవేలు చెట్టియార్ బృందం 'లేబర్ కిసాన్ గెజిట్' పేరిట ఒక పత్రిక తీసుకువచ్చారు. సింగార వేలు చెట్టియార్ నాయకత్వంలోనే భారతదేశంలో తొలిసారిగా 1923 మే 1 న మేడే దినోత్సవం నిర్వహించారు. మాస్కోలోని 'తూర్పుదేశాల కష్టజీవుల విశ్వవిద్యాలయంలో శిక్షణ పొందిన అమీర్ హైదర్‌ఖాన్ 1928లో భారతదేశానికి తిరిగివచ్చాడు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశాడు. అనేకమంది యువకులను కమ్యూనిస్టు పార్టీలో చేర్పించి, వారిని కార్యకర్తలుగా, నాయకులుగా తీర్చిదిద్దారు. పుచ్చలపల్లి సుందరయ్య అలా కమ్యూనిస్టు ఉద్యమం నుండి వచ్చినవాడే.


ఈ చిన్నచిన్న బృందాలు చేసిన అలుపెరుగని కృషి, ప్రచారం, నిర్మాణం, పత్రికానిర్వహణల కారణంగా దేశంలోని అనేక ప్రధాన నగరాలలో కమ్యూనిస్టుల పలుకుబడి గణనీయంగా పెరిగింది. కాన్పూర్, కరాచీలలో కమ్యూనిస్టు బృందాలు ఏర్పడ్డాయి.

కొమింటర్న్ సాయంతో యం.యన్.రాయ్ భారతదేశంలో ఆవిర్భవించిన ఈ వివిధ కమ్యూనిస్టు బృందాలతో సంబంధాలు ఏర్పాటుచేసుకునే దానికి కృషిచేస్తాడు. యస్.ఎ.డాంగే (బొంబాయి), ముజఫర్ అహ్మద్ (కలకత్తా), సింగర్ వేలు చెట్టియార్ (మద్రాస్)లకు పార్టీ నిర్మాణం, కార్యకలాపాల నిర్వహణలకు సంబంధించి

సలహాపూర్వక ఉత్తరాలు రాశాడు. దేశంలో ఉన్న వివిధ కమ్యూనిస్టు బృందాలను ఏకంచేసి అఖిలభారత విప్లవకేంద్రాన్ని ఏర్పాటుచెయ్యాలనే లక్ష్యంతో రాయ్ తన కృషి కొనసాగించాలి.


ముజఫర్ అహ్మద్


సింగారవేలు చెట్టియార్


ఎస్‌ఎ డాంగే

### బ్రిటిష్ పాలకుల అణచివేత, భారతకమ్యూనిస్టుపార్టీ పునర్నిర్మాణం

బ్రిటీష్ వలసపాలకుల రికార్డులు పరిశీలిస్తే వారికి దేశంలోని కమ్యూనిస్టు కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు తాజా గూఢచారి నివేదికలు అందేవని తెలుస్తుంది. బోల్షివిక్ భావజాల ప్రభావం నానాటికీ పెరుగుతున్న పరిణామాలపట్ల వలస పాలకులు తీవ్ర ఆందోళనలకు లోనయ్యారు. ఆ కారణంగానే మొగ్గలో ఉన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీని తుంచేయ్యాలనే ఆలోచనతో పార్టీమీద పెద్దఎత్తున విరుచుకుపడ్డారు.

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుండి దేశానికి స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ గడచిన రెండున్నర దశాబ్దాలపై కాలంలో పార్టీ తీవ్ర నిర్బంధాన్ని చవిచూసింది. కమ్యూనిస్టు సాహిత్యంపై, కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించారు. నాయకులను అరెస్టు చేశారు. బయట ఉన్న కొద్దిమందీ అజ్ఞాతంగా పనిచెయ్యాల్సి వచ్చింది.

### పెషావర్ కుట్రకేసు

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం తరువాత తోటి కమ్యూనిస్టు బృందం సోవియట్ నుండి భారతదేశానికి తిరిగి వస్తుండగా – 1921 జూన్‌లో పెషావర్‌లో అరెస్టు చేశారు. దేశంలో బోల్షివిక్ భావజాలాన్ని వ్యాప్తిచేస్తున్నారని నేరారోపణ కావించారు. రాజద్రోహనేరం మోపి ముందుగా మొహమ్మద్ అక్బర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. ఖిలాఫత్ వ్యతిరేక ఉద్యమం నుండి కమ్యూనిస్టులుగా మారిన తొలి ముస్లిం కమ్యూనిస్టు విప్లవకారులు అందరినీ 1921–27 మధ్యకాలంలో ఐదు కుట్ర కేసులు మోపింది బ్రిటిష్ ప్రభుత్వం. పెషావర్ బోల్షివిక్ కుట్ర కేసులుగా ఇవి చరిత్ర ప్రసిద్ధినొందాయి. బోల్షివిక్ కుట్రకేసులుగా ఇవి చరిత్ర ప్రసిద్ధినొందాయి. బోల్షవిక్‌లకు వార్తాహరులుగా

పనిచేస్తూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర పన్నారని వీరిమీద అభియోగాలు మోపారు. తూతూమంత్రంగా విచారణ జరిపేసి ఏడేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించారు.

అభియోగాలు మోపి, అక్రమ అరెస్టులకు గురై, అన్యాయంగా జైలుపాలయిన వీరంతా స్వాతంత్ర్య సమరయోధులే అయినప్పటికీ అక్రమ శిక్షలు పడినప్పుడు కూడా కాంగ్రెస్ గానీ, ముస్లింలీగ్ గానీ బ్రిటిష్ ప్రభుత్వాల్ని పల్లెత్తు విమర్శించలేదు, నిరసించలేదు. కొమింటర్న్, యం.యన్.రాయ్‌లు మాత్రమే బ్రిటిష్ దమననీతిని ఖండించారు.

## కాన్పూర్ కుట్రకేసు

పెషావర్ కుట్రకేసుతో బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు భావజాలవ్యాప్తిని అడ్డుకోవాలని ప్రయత్నించింది. కానీ కార్మికవర్గం రైతాంగంలో కమ్యూనిస్టుల ప్రభావం పెరుగుతూనే వచ్చింది. అందుకే ఈసారి ప్రధాన కమ్యూనిస్టు నాయకత్వాన్ని అరెస్టు చెయ్యాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. పెషావర్ కుట్రకేసు ఒక కొలిక్కి వస్తుండగానే దేశంలోని వివిధ కమ్యూనిస్టు బృందనాయకులను అరెస్టు కావించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఇది కాన్పూర్ కుట్ర కేసుగా చరిత్ర ప్రసిద్ధికెక్కింది.

దేశంలోనూ, విదేశాల్లోనూ ఉండి పనిచేస్తున్న అన్ని ప్రధాన కమ్యూనిస్టు పార్టీ నాయకుల పేర్లను ఈ కుట్రకేసులో ఇరికించారు. యం.యన్.రాయ్, ముజఫర్ అహ్మద్, షౌకత్ ఉస్మాన్, గులామ్ హుస్సేన్, ఎస్.ఎ.డాంగే, సింగార్‌వేలు, ఆర్.సి.శర్మ, నళినిగుప్తా, షంషూద్దీన్ హాసన్, యం.పి.యస్. వేలాయుధన్, డాక్టర్ మణిలాల్ షా, సంపూర్ణనంద మరియు సత్యభక్తల మీద కేసు కట్టారు. అంతిమంగా చివరి ఐదుగురి పేర్లు వదిలిపెట్టి, మొదటి ఎనిమిది మంది మీద ఛార్జిషీట్ బనాయించారు. ఈ ఎనిమిదిమందిలో యం.ఎన్.రాయ్ జర్మనీలోను, శర్మ ఫ్రెంచిపాలిత పాండిచ్చేరిలోనూ నివసిస్తూన్నారు కుట్రకేసు మోపే సమయానికి.

ఛార్జిషీట్‌ఏ అనుబంధంగా దాఖలు చేసిన పేపర్లను పరిశీలిస్తే (ఇప్పటికీ అవి ఢిల్లీలోని జాతీయ పురాతన గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.) యమ్.యన్.రాయ్ తదితర ప్రవాసీ కమ్యూనిస్టులు, భారతీయ కమ్యూనిస్టులు, కొమింటర్న్‌ల మధ్య నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటినీ బ్రిటిష్ ప్రభుత్వం చేజిక్కించుకుందని మనకు అర్థమవుతుంది. ఆ రకంగా బ్రిటీష్ వలస ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూలదోయడానికి కమ్యూనిస్టులు పనిచేస్తున్నారని రుజువు చెయ్యడానికి తగిన సాక్ష్యాలను సంపాదించింది. 1924 ఏప్రిల్ నెలలో బ్రిటిష్ న్యాయాధిపతి హోమ్స్ ముందుకు ఈ కేసు విచారణకు వచ్చింది. చౌరిచౌరా కేసులో మొత్తం 172 మంది రైతులకు మరణ శిక్ష విధించిన క్రూరమైన జడ్జి ఈ హోమ్స్, నెల రోజులలో విచారణ పూర్తిచేసి నిందితులు అందరికీ నాలుగేళ్ళు కఠిన కారాగార

శిక్ష విధించారు.

పెషావరు కుట్రకేసుకు భిన్నంగా ఈ కుట్రకేసుకు వ్యతిరేకంగా జాతీయంగానూ అంతర్జాతీయంగానూ పెద్దఎత్తున సంఘీభావం వెల్లడయింది. కమ్యూనిస్టులు కూడా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న యోధులే అన్న భావన ప్రజలలో వ్యాప్తిచెందింది.



ఎస్‌వి ఘాటే

ప్రధానమైన కమ్యూనిస్టు బృందాల నాయకులు అండమాన్ జైలుపాలయి ఉన్న కారణాన 1923 జూన్ 23న ఈ బృందాలన్నీ కలిసి ఐక్యంగా నిర్వహించదలపెట్టిన సదస్సు రద్దయిపోయింది. మరో రెండేళ్ళ తరువాత సదస్సు జరిగింది.

## కాన్పూర్ కమ్యూనిస్టు మహాసభ, 1925

1925 డిసెంబరు నెలలో దేశంలోని కమ్యూనిస్టు బృందాలన్నీ కలిసి కాన్పూర్‌లో తొలి మహాసభ నిర్వహించు కున్నాయి. కాంగ్రెస్ వార్షిక మహాసభ కూడా అదే కాన్పూర్ నిర్వహించతలపెట్టింది. రాజస్థాన్‌కు చెందిన సత్యభక్త కాంగ్రెస్ పార్టీలోనే ఉండి ఉత్తరప్రదేశ్ కార్యక్షేత్రంగా పనిచేస్తూ, కాన్పూర్ కుట్రకేసులో సరైన సాక్ష్యాధారాలు లేనందున విడుదల చెయ్యబడిన సత్యభక్త ఈ మహాసభను నిర్వహించారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ నాయకుడిగా సత్యభక్తను ఉదహరిస్తుంటారు.

దాదాపు 500 మంది ప్రతినిధులు – అందులో మెజారిటీ స్థానికంగా ఉన్న కార్మికులు, రైతులు– ఈ మహాసభకు హాజరైనట్టు చెబుతుంటారు. కమ్యూనిస్టుల మహాసభ వేదికకు దాపున ఉన్న మరో ప్రాంతంలో కాంగ్రెస్ మహాసభ జరిగింది. కాంగ్రెస్ పార్టీలో ఉండి అతివాద భావజాలంలో పనిచేస్తున్న వాళ్ళంతా కూడా కమ్యూనిస్టు మహాసభకు హాజరయ్యారు.

దేశంలో కష్టజీవుల శ్రమని దోచుకోవాలనుకుంటున్న అంతర్జాతీయ – జాతీయ పెట్టుబడిదారులు, బడా భూస్వాములను తీవ్రంగా తెగనాడుతూ ఈ మహాసభ ఒక తీర్మానం చేసింది. కార్మికులు, రైతులపై సాగుతున్న ఈ దోపిడీని అంతం చెయ్యడానికి మహాసభ ప్రతినబూనింది.

ఇతరత్రా నిర్ణయాలతోబాటు ఏ మతతత్వ సంస్థకు చెందిన వ్యక్తులనయినా పార్టీలో చేర్చుకోకూడదు అని నిర్ణయించింది ఆ మహాసభ. అప్పటిదాకా భారతదేశంలో

ఏ రాజకీయపార్టీ కూడా ఇలాంటి నిబంధన పెట్టుకోలేదు.

సింగారవేలు చెట్టియార్‌ను అధ్యక్షుడిగా, యస్.వి.ఘాటే, జె.పి.బాఘెర్ హట్టాలను ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకుంది. ఈ మహాసభ బొంబాయి కేంద్రంగా పార్టీ కేంద్ర కార్యాలయం నడపాలని తీర్మానించింది. నిర్ణయాలతో సరిపడని సత్యభక్త మహాసభల నుండి మధ్యలోనే నిష్క్రమించారు.

మహాసభ అనంతరం దేశంలోని వివిధ కమ్యూనిస్టు బృందాల పనిని సమన్వయపరిచే కృషిని చేపట్టింది భారత కమ్యూనిస్టు పార్టీ.

# ప్రజాపోరాటాలు
# మతతత్వ వ్యతిరేక ప్రచారాందోళన

### మతతత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల పోరాటం

1925లో పునర్మించబడిన భారతకమ్యూనిస్టు పార్టీ 1926 మే లో విడుదల చేసిన ప్రణాళికలో మతతత్వ ప్రమాదం మీద విస్పష్టమైన అభిప్రాయాన్ని ప్రకటించింది. అధికారిక గణాంకాల ప్రకారమే 1922-27 మధ్యకాలంలో 112 మతకలహాలు చోటుచేసుకుంటాయి. 450 మంది దుర్మరణం పాలయ్యారు, 5000 మంది గాయపడ్డారు. సహాయనిరాకరణోద్యమ తుది దశలో గతంలో ఎన్నడూ లేనివిధంగా హిందూ, ముస్లిమ్‌లు గరిష్ట ఐక్యతతో పాల్గొన్నారు. మతతత్వ అంశం ఈ ఉద్యమ ఐక్యతను చివరిలో విషతుల్యం చేసింది. మత విద్వేషాలకు బ్రిటీష్ ప్రభుత్వమే ఆజ్యంపోసినా జాతీయోద్యమ నాయకులు పెక్కుమంది ముస్లిం లీగ్‌లో చేరారు. హిందూమహాసభ నాయకుడు విడి సావార్కర్ 1923లో 'అఖండ హిందుత్వ మీద పుస్తకం రాయడం, 1925లో ఆర్.యస్.యస్‌ను స్థాపించడం ఈ దశలోనే జరిగాయి.

ఇతర సమస్యల మాదిరిగానే మతతత్వ అంశంమీద భారత కమ్యూనిస్టు పార్టీ విస్పష్టమైన వైఖరి తీసుకుంది. కాంగ్రెస్‌లో పనిచేసేవారు ఎవరైనా మత సంస్థలో కూడా చేరి పనిచెయ్యడానికి ఆ పార్టీ ఎలాంటి అభ్యంతరం పెట్టని ఆ రోజుల్లోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ఎవరూ మతసంస్థల్లో చేరడానికి, పనిచెయ్యడానికి వీల్లేదనే స్పష్టమైన షరతు విధించింది.

'హిందూ-ముస్లిమ్ సమస్యల' మీద ముజఫర్ అహ్మద్, జె.పి.బాగెర్‌హట్టా ఒక డాక్యుమెంట్ విడుదల చేశారు. ''హిందూ ముస్లింమతాలకు చెందిన కష్టజీవులందరూ విదేశీ - దేశీ పెట్టుబడిదారులు, బడా భూస్వాముల చేతిలో దోపిడికి



**మతతత్వానికి వ్యతిరేకంగా**
**లాహోర్‌లో కమ్యూనిస్టుల సైకిల్ ర్యాలీ**

గురికాబడుతున్న వారే, మతతత్వ ప్రచారంగా కూడా దైవం పేరిట ఈ దోపిడి కొనసాగడానికి ఉపకరించేదే" అని స్పష్టపరిచింది భారత కమ్యూనిస్టు పార్టీ, దోపిడీరహిత, వర్గరహిత సమాజం కోసం కష్టజీవులందరూ ఐక్యంగా నిలబడి ఉమ్మడిగా పోరాటం చెయ్యాలని పార్టీ పిలుపునిచ్చింది. కష్టజీవుల ఆర్థికపోరాటాలను బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతో మేళవించి కమ్యూనిస్టు పార్టీ, అలానే మతవిద్వేషాలను అరికట్టడానికి, మతసామరస్యాన్ని కాపాడడానికి అగ్రభాగాన నిలబడి కృషి చేసింది.

## ప్రజాపోరాటాల నిర్మాణం

కమ్యూనిస్టు పార్టీ నాయకులు బ్రిటిష్ జైళ్ళ నుండి విడుదల అయిన తరువాయి కాలం నుండి పార్టీ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. 1927 మే నెలలో బొంబాయిలో సమావేశమైన పార్టీ నాయకులు సరికొత్త రాజ్యాంగాన్ని రూపొందించారు. అప్పటికి అది ముసాయిదా దశలోనే ఉంది. ఈ సమావేశంలో బలమైన కమ్యూనిస్టు కేంద్రాన్ని నిర్మించుకుని తద్వారా పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలను పెంపొందించడానికి పార్టీ నిర్ణయించింది. బ్రిటీష్ వలస పాలన నుండి సంపూర్ణ స్వాతంత్ర్యం, వయోజన ఓటింగ్ హక్కు కల్పించడం, భూస్వామ్య విధానం రద్దు, ప్రజోపయోగ సేవలను జాతీయం చేయాలి అనే ప్రధానమైన డిమాండ్లను పునరుద్ఘాటించింది. 'గణవాణి' (బెంగాలీ వారపత్రిక), మెహంతక్ష్ (లాహోర్ నుండి ప్రచురితమవుతున్న ఉర్దూ పత్రిక), క్రాంతి (బొంబాయి నుండి వెలువడుతున్న మరాఠి పత్రిక ), పత్రికలను పార్టీ అధికారిక పత్రికలుగా ప్రకటించింది.

ఆనాటికి కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం బెంగాల్, లాహోర్– ఇక్కడ ముఖ్యంగా

కార్మిక సంఘాల కృషి పెద్ద ఎత్తున ఉండేది– బొంబాయి, రాజ్‌పుతానా, మద్రాస్ ప్రెసిడెన్సీలో బలంగా ఉండింది. ఉత్తర ప్రదేశ్‌లో కూడా ఒక బృందం క్షేత్రస్థాయి కృషిలో ఉండింది. కమ్యూనిస్టులు కార్మిక, రైతాంగ పార్టీలలోనూ, కాంగ్రెస్ దాని అనుబంధ కార్మిక సంఘాల్లోనూ ఉండి చురుకుగా పనిచేశారు.

కార్మిక సంఘాల్లో కమ్యూనిస్టు కృషిమూలంగా ఢిల్లీలో జరిగిన ఎఐటియుసి మహాసభలో బొంబాయి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న ఎస్.వి.ఘాటే, తొలిసారిగా నాయకత్వ స్థానానికి ఎన్నుకోబడ్డారు. ఎఐటియుసి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మే దినోత్సవ వేడుకలు జరుపుకుంది కార్మికవర్గం. కమ్యూనిస్టులు ఎఐటియుసి నాయకత్వంలోకి ఏ మేరకు ఎన్నుకోబడ్డారో ఆ మేరకు సంఘ కార్యకలాపాల్లో సమరశీలత పెరిగింది.

## వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ

ఈ కాలంలో చట్టబద్ధ కార్యకలాపాలు దాదాపు సాధ్యమయిన పరిస్థితుల్లో వివిధ రాష్ట్రాల్లో కార్మిక–కర్షక పార్టీ శాఖలను ఏర్పాటు చెయ్యడానికి కమ్యూనిస్టులు విశేషకృషి చేశారు.వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ స్థాపించడం వెనుక పార్టీ ఆలోచన ఏమిటి? కార్మిక – కర్షక వర్గాన్ని, పెటీ బూర్జువాలను కలుపుకుని జాతీయ ప్రజాతంత్ర విప్లవ సాధనకోసం కృషిచెయ్యాలి. బ్రిటీష్ వలసపాలన నుండి విముక్తితో పాటు భూస్వామ్య వ్యవస్థను అంతమొందించాలని, బూర్జువా ప్రజాస్వామ్య సాధన ద్వారా సామాన్య ప్రజానీకానికి హక్కులు సాధించాలని పార్టీ భావించింది.

కాంగ్రెస్, లేబర్ స్వరాజ్ పార్టీలలో ఉన్న అభ్యుదయ శక్తులను కలుపుకుని 1925లో బెంగాల్‌లో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ ఏర్పడింది. కమ్యూనిస్టుల చొరవతో 1927లో బొంబాయిలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ శాఖ ఆవిర్భవించింది. ఈ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ సదస్సులో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ విధివిధాన పత్రం, భవిష్య ప్రణాళికను పంపిణీ చేశారు. రాజపుతనా ప్రాంతంలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ శాఖ ఏర్పడింది. 1928 లో పంజాబ్‌లో, ఆ వెనువెంటనే ఉత్తర ప్రదేశ్‌లో కూడా పార్టీ శాఖలు ఏర్పడ్డాయి.

1928 నాటికి వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ గణనీయంగా విస్తరించి, తన పలుకుబడి పెంచుకుంది. సైమన్ కమిషన్ పర్యటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 3 న జాతీయ నిరసన దినంగా పాటించాలన్న పిలుపును వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ పూర్తి స్థాయిలో బలపరిచి ఆ నిరసనలో చురుకుగా పాల్గొంది. సైమన్ కమిషన్

బొంబాయి వచ్చిన రోజున కార్మికులు పెద్దఎత్తున ధర్నాలకు, నిరసనలకు పూనుకున్నారు. ఈ ఆందోళనల్లోనే తొలిసారిగా వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ సుత్తి కొడవలి గుర్తుగల ఎర్రజెండాలను రెపరెపలాడించింది. సైమన్ కమిషన్ కలకత్తా దర్శించినప్పుడు కూడా వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ అక్కడి ధర్నాలు, నిరసన ప్రదర్శనలలో చురుకైన పాత్ర పోషించింది. బెంగాల్, బొంబాయి, పంజాబ్ ప్రాంతాలలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ యువజనులమీద ప్రత్యేక దృష్టి పెట్టి వారిని వర్గపోరాట రాజకీయాల్లోకి తీసుకురావడానికి పెద్ద ఎత్తున కృషిచేసింది. 1928 ఏడాది చివరినాటికి వివిధ ప్రావిన్షియల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆ పార్టీశాఖలన్నీ కలసి అఖిలభారత స్థాయిలో వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీని నిర్మించాయి.

ఈ కాలంలో (1928, సెప్టెంబర్) కొమింటర్న్ 6వ మహాసభ వలసపాలనపై రెండో సిద్ధాంతం (సెకండ్ కలోనియల్ థీసిస్) అన్న డాక్యుమెంటును ఆమోదించింది. వలస వ్యతిరేక పోరాటాలలో అనుసరించాల్సిన వ్యూహాలకు సంబంధించిన ఈ డాక్యుమెంటులో) కొన్ని ఒంటెత్తు పోకడలు ఉన్నాయి.

వలసపాలన వ్యతిరేక పోరాటంలో ఐక్య సంఘటన ఎత్తుగడలను తిరస్కరిస్తూ కార్మికవర్గ అగ్రగామిదళంగా కమ్యూనిస్టు పార్టీలే వలసవ్యతిరేక పోరాటాలను ముందుండి నడిపించాలని కొమింటర్న్ 6వ మహాసభ పిలుపునిచ్చింది. వలస పాలనలో మగ్గుతున్న దేశాల్లో బూర్జువావర్గం సామ్రాజ్యవాద పాలకులతో షరీకవుతుంది అనే అతి సాధారణ అంచనాకు రావడం, అలానే ఆయా వలసదేశాల్లో కమూనిస్టు పార్టీలు జాతీయ విమోచనోద్యమాన్ని ముందుండి నడిపించగలిగేంతటి బలమైన శక్తికలవి అన్న అతి అంచనాకు రావడం ద్వారా ఐక్య సంఘటన ఎత్తుగడలను నిరాకరించింది. బహుశా చైనా జాతీయవిముక్తి పోరాట అనుభవాలనుండి కొమింటర్న్‌ను ఈ అంచనాకు వచ్చి ఉండొచ్చు. చైనాలో జాతీయ బూర్జువాకు ప్రాతినిధ్యం వహించే 'కుమింటాంగ్' పార్టీ జపాన్ సామ్రాజ్యవాదంలో షరీకయ 'ఐక్య సంఘటన' ఎత్తుగడలో చైనా కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీసింది. ఈ అనుభవం నుండి కొమింటర్న్ అలాంటి నిర్ణయానికి వచ్చి ఉంటుంది. అంతేకాదు భారత కమ్యూనిస్టులు 'వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ' ని రద్దుచేసి బహిరంగంగా కమ్యూనిస్టు పార్టీగా పనిచెయ్యాలని కొమింటర్న్ ఆరవ మహాసభ సలహా ఇచ్చింది.

అయితే 1930-34 మధ్యకాలంలో ఉవ్వెత్తున సాగిన సహాయ నిరాకరణోద్యమం, దేశంలోని కమ్యూనిస్టు నాయకులందరి మీదా బనాయించిన మీరట్ కుట్రకేసులు ఈ సైద్ధాంతిక, నిర్మాణపరమైన అంశాలను పూర్వపక్షం చేశాయి.

## 1928-32 :
## పోరాటాల వెల్లువ

సహాయ నిరాకరణోద్యమం ఉపసంహరించుకోవడం మూలంగా జాతీయోద్యమానికి ఎదురుదెబ్బ తగిలింది. అయితే కమ్యూనిస్టుల అవిశ్రాంత కృషి మూలంగా 1928లో కార్మికవర్గ పోరాటాలు పెద్ద ఎత్తున జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ఏకీకృతమై సంఘటితమవడం మూలంగా వర్గ ప్రాతిపదికన కార్మికులతో అటు ఫ్యాక్టరీలలోనూ, ఇటువారు నివసించే బస్తీలలోనూ కమ్యూనిస్టులు సజీవ సంబంధాలు మెరుగుపరుచుకోగలిగారు. ఆ ఏడాది సైమన్ కమిషన్ పర్యటనకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనలలో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొనడం కేవలం కమ్యూనిస్టు పార్టీ కృషివలనే సాధ్యపడింది. ఏడాది తిరిగేసరికల్లా కార్మిక పోరాటాలు ద్విగుణీకృతమయ్యాయి. అధికారిక గణాంకాల ప్రకారం 1927-28 మధ్య కాలంలో జరిగిన 129 సమ్మెల్లో 131,655 మంది కార్మికులు పాల్గొంటే, 1928-29 మధ్యకాలంలో 203 సమ్మెల్లో 506,851 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెల మూలంగా 3,16,47,404 పని దినాలు నష్టపోయినట్లు ప్రభుత్వం లెక్కతీసింది. అంతకుముందు ఐదేళ్ళలో జరిగిన సమ్మెల మూలంగా జరిగిన పనిదినాల నష్టం ఎక్కువగా ఉందంటేనే కార్మికుల సమ్మెపోరాటాలు ఎంత ఉధృతిన సాగాయో మనం అర్థంచేసుకోవచ్చు. పారిశ్రామిక నగరంగా ఉన్న బొంబాయి సమరశీల కార్మిక సమ్మె పోరాటాలకు కేంద్రంగా మారింది. 1928 ఏప్రిల్ 26నుండి అక్టోబర్ 6 వరకు టెక్స్‌టైల్ కార్మికులు 6 నెలలపాటు సమ్మె చేశారు. రేషనలైజేషన్ (క్రమబద్ధీకరణ) పేరిట మిల్లు యజమానులు కార్మికుల తొలగింపునకు చేసిన కుట్రలకు వ్యతిరేకంగా ఈ నిరవధిక సమ్మె చోటుచేసుకుంది. మిల్లు కార్మికులను సంఘటితం చేయడానికి స్థాపించిన గిర్నికామ్‌గార్ యూనియన్ (ఎర్రచావులూ) సభ్యత్వం ఆ ఏడాది 324 నుండి 65,000 కు పెరిగింది. అలానే బెంగాల్‌లో 1928 మార్చినుండి జూలై నెలవరకు రైల్వే కార్మికులు నాలుగునెలలపాటు సుదీర్ఘ సమ్మెచేశారు. జౌళి కార్మికులయితే 1928 జూలైనుండి 1929 జనవరి వరకూ 6నెలలు పాటు సమ్మెచేశారు. ఆ సందర్భంగానే కమ్యూనిస్టు నాయకులను అరెస్టుచేశారు. ఈ మొత్తం కార్మికవర్గ పోరాటాలలో మహిళా కార్మికులతో పాటు, కార్మికుల కుటుంబసభ్యులు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 1928 డిసెంబర్ నెలలో ఝరియాలో జరిగిన ఎఐటియుసి మహాసభ బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టదలచిన పబ్లిక్ సేఫ్టీబిల్లు, ట్రేడ్ డిస్ప్యూట్ బిల్లులకు వ్యతిరేకంగా ఒకరోజు దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ బిల్లులను శాసనంగా మలిస్తే దేశ వ్యాపిత సమ్మెకు సమాయత్తం కావాలని మహాసభ

కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. ఈ మహాసభ అనేక అంతర్జాతీయ కార్మిక సంఘాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుంది.

ఏడాది చివరిలో కలకత్తా కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఈ మహాసభలో కమ్యూనిస్టులు మరోసారి సంపూర్ణ స్వరాజ్య తీర్మానం కోసం పట్టుపట్టారు. దేశంలో సమూల మార్పులు కోసం పోరాడకుండా, దేశానికి స్వయం ప్రతిపత్తి మాత్రమే కోరుతున్న కాంగ్రెస్ వైఖరిని విమర్శించారు. మహా రెండవ రోజున అపూర్వమైన ఘటన జరిగింది. వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ (డబ్ల్యుపిపి) నాయకత్వంలో 50,000 మంది కార్మికులు మహాసభ ప్రాంగణానికి ప్రదర్శనగా వచ్చారు. వీరిలో వందలాది మంది మహిళలు కూడా ఉన్నారు. ప్రదర్శకులు మహా సభ పందాల్ వరకు వచ్చేశారు. వీరి సభనుద్దేశించి మహాత్మా గాంధీతో సహా అనేకమంది కాంగ్రెస్ నాయకులు ప్రసంగించారు. ఈ సభ సంపూర్ణ స్వరాజ్యాన్ని డిమాండ్ చేస్తూ ప్రత్యేకంగా ఒక తీర్మానాన్ని అమోదించింది. అధికారిక మహాసభలో జరుగినదానికి భిన్నంగా ఇక్కడ జరిగింది.

1930 దశకం ప్రారంభంలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. 1931లో 2,03,008 మంది కార్మికులు పాల్గొన్న 166 పారిశ్రామిక వివాదాలు కొనసాగినట్లు ప్రభుత్వం రికార్డు చేసింది. 1933లో 1,64,938 మంది కార్మికులు పాల్గొన్న 146 పారిశ్రామిక వివాదాలు రికార్డయ్యాయి. ఒకవైపు వర్గ పోరాటం పెరుగుతూ ఉంటే మరోవైపు వర్గపోరాటాన్ని నీరుగార్చడానికి మితవాద పక్షాలు చేస్తున్న ప్రయత్నాలను ట్రేడ్‌యూనియన్ ఉద్యమం ఎదుర్కొనవలసి వచ్చింది. మీరట్ కుట్ర కేసులో అనేకమంది కీలక కమ్యూనిస్టు నాయకులు జైళ్లలో ఉండడం చూసి మితవాదులు ఎఐటియుసి నుండి చీలిపోయారు. ఉద్యమాన్ని తాత్కాలికంగా బలహీనపరిచారు.

జాతీయోద్యమంతోపాటే వివిధ రైతాంగ ఉద్యమాలు కూడా ఉధృతినందుకున్నాయి. రైతుల చైతన్యాన్ని అడ్డుకోడానికి ప్రయత్నించిన కాంగ్రెస్ పార్టీ కొన్ని చోట్ల కుట్రపూరితంగా వ్యవహరించింది. అందువల్లనే అది 1928లో చేసిన బెంగాల్ కౌలురైతు (సవరణ) బిల్లును వ్యతిరేకించలేకపోయింది. కౌలు రైతుల రక్షణ కల్పించే హక్కుల కోసం కమ్యూనిస్టులు పోరాటాలు నడిపారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ హిందూ మహాసభతో కలిసి హిందూ వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని వ్యతిరేకించింది. బీహార్‌లోని చంపారణ్, శరణ్, మోంఘిర్ జిల్లాల్లో స్వామి సహజానంద (ఈయన అఖిల భారత కిసాన్ సభ వ్యవస్థాపక అధ్యక్షుడైనాడు) నాయకత్వంలో జరిగిన రైతాంగ ఉద్యమంలో కాంగ్రెస్ యొక్క ఈ పాత్ర మరింత బహిరంగంగా వెల్లడయింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉదాహరణకు

ఆంధ్ర, గుజరాత్‌లోని బార్డోలిలో కాంగ్రెస్ రైతు ఉద్యమాలు నడిపింది గానీ ఒక పరిమితిలోనే.

ముఖ్యంగా గుర్తించాల్సిన విషయం ఏమంటే, బ్రిటిష్ పాలకుల దోపిడీ విధానాలను సవాలు చేస్తూ జరిగిన కార్మికవర్గ, రైతాంగ ఉద్యమాలు స్వాతంత్ర్యోదమంలో అంతర్భాగంగా ఉన్నాయి. ఆ ఉద్యమానికి ఒక ముఖ్యమైన దిశానిర్దేశం కల్పించాయి.

# సహాయ నిరాకరణోద్యమం, బ్రిటిష్ అణచివేత

1929 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ లాహోర్ మహాసభలో సంపూర్ణ స్వరాజ్యం తీర్మానాన్ని ఆమోదించాక సాతంత్ర్యోద్యమం ఊపందుకుంటుందని దేశమంతా భావించారు. అటువంటి దానికోసం ఎదురుచూశారు. దీనికి తోడు మహా మాంద్యం ఏర్పడి ప్రపంచమంతా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగిపోయింది. దీన్ని ప్రభావం భారత ప్రజలపై తీవ్రంగా పడింది.


సహాయనిరాకరణోద్యమాన్ని మహాత్మా గాంధీ రూపొందించి, తనదైన శైలిలో నడిపినప్పటికీ అది విప్లవ పోరాటాలతో నిండిపోయింది. బ్రిటిష్ వాళ్లు 'ఉగ్రవాద' ఘటనలుగా పేర్కొన్న ఘటనలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 1930 ఏప్రిల్‌లో చిట్టగాంగ్‌లో ఆయుధాగారంపై దాడి అనంతరం దగ్గరలోని కొండల్లో సాయుధ తిరుగుబాటు, ఢాకాలోని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హత్య, తదుపరి కలకత్తాలో రైటర్స్ భవనంపై దాడి, 1930 మే నెలలో సోలాపూర్‌లో తిరుగుబాటు, మార్షల్ లా విధింపు, వీటన్నిటికీ మించి భగత్ సింగ్ ఆయన సహచరుల నాయకత్వంలో జరిగిన వీరోచిత కార్యకలాపాలు వీటిలో కొన్ని. ఈ కార్యకలాపాలకు గాను భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఉరితీశారు.


భగత్ సింగ్

### కమ్యూనిస్టులతో చేరిన హీరోలు

ఈ విప్లవకారుల్లో అనేక మంది బ్రిటిష్ లక్ష్యాలపై వ్యక్తిగత దాడులు చేయడం వల్ల ఫలితం లేదని సైద్ధాంతికంగా సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలవైపు మొగ్గారు.

ఇదంతా రికార్డు అయివుంది. భగత్ సింగ్ తనను తాను కమ్యూనిస్టుగా భావించాడని ఆయన రచనలు తెలుపుతున్నాయి. ఆయనతో బాటు హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిన్ ఆర్మీకి చెందిన కిషోరీ లాల్ వంటి వారు తరువాత సిపిఐ సభ్యులైనారు. భగత్ సింగ్ గ్రూపులోని సభుడైన శివ వర్మ సోషలిస్టు విప్లవాన్ని భగత్ సింగ్ ఎలా నమ్మిందీ, లెనిన్‌ను ఆయన ఎంతగా అభిమానించిందీ రాశాడు. శివ వర్మను బ్రిటిష్ ప్రభుత్వం అండమాన్ జైలుకు పంపింది. ఆయన నరకంలాంటి ఆ జైలులో అనేక సంవత్సరాలు గడిపాడు. జైలు నుండి విడుదలైన తరువాత శివ వర్మ, ఆయన జైలు సహచరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరి నాయకత్వ బాధ్యతలు వహించారు.


శివ వర్మ


బిజయ్ కుమార్ సిన్హా


కల్పనా దత్త

'ఉగ్రవాద' చర్యల్లో పాల్గొన్న అనేక మంది యువకులను అండమాన్ జైలుకు పంపారు. 1922, 1941 మధ్య 415 మంది రాజకీయ ఖైదీలు అండమాన్ జైలులో అత్యంత అమానుషమైన, ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఈ వీరుల్లో చాలా మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. జైలు లోపల, ముఖ్యంగా ముప్పయివ దశకంలో, కమ్యూనిస్టు కన్సాలిడేషన్ అనే పేరుతో ఒక కమ్యూనిస్టు గ్రూపు ఏర్పడి పనిచేయడం ప్రారంభించింది. జైలులో ఒక అధ్యయన గ్రూపు ఏర్పడింది. వీరోచితమైన నిరాహారదీక్ష తరువాత వాళు కొన్ని కోర్కెలు సాధించుకున్నారు. వాటిలో ఖైదీలకు కమ్యూనిస్టు సిద్ధాంతానికి చెందిన సాహిత్యంతో సహా సాహిత్యాన్ని అందజేయాలన్నది ఒకటి.

కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో లిఖించదగ్గ అనేక పేర్లున్నాయి. వారిలో చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి చేసిన సుబోధ్ రాయ్ ఒకరు. ఆయన, ఇంకా కొంతమందీ తమ కాలంలో జైలులో ఎలా ఉండేదో, తాము కమ్యూనిస్టులం ఎలా అయ్యామో వివరంగా రాశారు. వారిలో గణేష్ ఘోష్, సతిష్ ప్రకాషి, గోపాల్ ఆచార్య, బంగేశ్వర్ రాయ్, అనంత సింగ్, సుదాంశు దాస్‌గుప్త, హరే కృష్ణ కోనార్, డాక్టర్ నారాయణ్ రాయ్, నిరంజన్ సేన్ గుప్త ప్రభృతులున్నారు. డాక్టర్ నారాయణ్ రాయ్, నిరంజన్ సేన్ గుప్త స్టడీ సర్కిల్స్ నిర్వహణను ప్రాంరభించి నడిపారు. వీటిలో కమ్యూనిస్టు

సిద్ధాంతాన్ని బోధించేవారు. స్టడీ బోర్డుకు బిజయ్ కుమార్ సిన్హా కార్యదర్శిగా ఉండేవారు.

ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్న చాలా మంది యువతులు కూడా కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వారిలో కల్పనా దత్ ఏడేళ్లు జైలులో గడిపారు. కమలా చటర్జీ ఆరేళ్లు జైలు జీవితం గడిపారు.


చిటగాంగ్ విప్లవ వీరులు అనంత సింగ్, అంబికా చక్రవర్తి, గణేష్ ఘోష్

ఈ వీరోచిత యువతీ యువకులు ఇంతటి తీవ్రమైన అణచివేతను, చిత్ర హింసను భరిస్తూ కూడా వ్యక్తిగత హీరో చర్యల పట్ల తమలో ఉన్న నమ్మకాలను వదిలిపెట్టి సోషలిజం సాధించడానికి వర్గ, ప్రజా పోరాటాలే మార్గమన్న నమ్మకానికి వచ్చారంటే, దానికి నాటి స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్ర వారికి స్ఫూర్తినివ్వడమే కారణం.

కమ్యూనిస్టుల బలం, ప్రభావం పెరగడం పట్ల బ్రిటిష్ వాళ్లు ఆందోళనకు గురయ్యారు. కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయడం ప్రారంభించారు. అదే మీరట్ కుట్ర కేసుగా ప్రసిద్ధి చెందింది.

## 1929 మీరట్ కుట్ర కేసు

1929 మార్చి 20 బ్రిటిష్ ప్రభుత్వం దేశంలోని వివిధ ప్రాంతాల్లోని 31 మంది కీలకమైన కమ్యూనిస్టు– కార్మిక నాయకులను అరెస్టు చేసింది. దీనికోసం ఒక ప్రణాళిక ప్రకారం దేశంలోని పలు ప్రాంతాల్లో ఒకే సారి అనేక గృహాలు, ఆఫీసుల్లో దాడులు చేసింది. వారందరిపై బ్రిటిష్ వలస ప్రభుత్వాన్ని కూల్చేయడానికి కుట్రపన్నారన్న నేరం మోపింది. నిందితుల్లో 13 మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. కొందరు వేరే చోట్ల కమ్యూనిస్టు పార్టీలకు అనుబంధంగా ఉన్నవారు. వీరిలో ఫిలిప్ స్ప్రాట్, బెంజమిన్ బ్రాడ్లేలు కూడా ఉన్నారు. ఇతరులు ట్రేడ్ యూనియన్ నాయకులు. వారిపై విచారణ మీరట్‌లో 1933 ఆగస్టు వరకు సాగింది. ఈ విచారణ కమ్యూనిస్టులకూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమానికే కాకుండా మొత్తం స్వాతంత్రోద్యమానికి సమీకరణ కేంద్రంగా మారింది. భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం లోతుగా వేళ్లూనుకున్నదని ఇది ప్రపంచానికి చాటింది.

బ్రిటిష్ వాళ్లు ఒక 25 వాల్యూమ్‌ల కేసు ఫైలు సిద్ధం చేశారు. దానికి 3,500

ఆధారాలు (ఎగ్జిబిట్స్), 320 మంది సాక్షులు తోడు చేశారు. అయితే, కేవలం వీళ్లంతా కార్మికులను, రైతులను సమీకరించే సాధారణ కార్యకలాపాల్లో మాత్రమే పాల్గొంటున్నట్లు ఆధారాలు చూపించగలిగారు. ఏ ఇతర ప్రజాస్వామ్య దేశంలోనైనా ఇది అందరికీ లభించే హక్కు.


మీరట్ కుట్రకేసు నిందితులు

ఈ విచారణను తమ ఆలోచనలను ప్రచారం చేసే వేదికగా ఉపయోగించాలని ఖైదీలు అనుకున్నారు. అందులో భాగంగా 18 మంది కమ్యూనిస్టులు ఒక 'సాధారణ ప్రకటన' చేశారు. ఇది భారత దేశంలోనూ, విదేశీల్లోనూ సంచలనం సృష్టించింది. ఈ విచార ణను 'వర్గ పోరాటంలో ఒక దశ'గా ప్రకటన అభివర్ణించింది. జాతీయ పరిస్థితి గురించి సమగ్రమైన విశ్లేషణ చేసింది. కార్మికవర్గం, రైతాంగ సమస్యలను ప్రస్తావించింది. మహిళల సమస్యలు చెబుతూ మహిళా విముక్తి పట్ల కమ్యూనిస్టుల అవగాహన గురించి వివరించింది. జాతీయ విముక్తి సాధించే ఎత్తుగడలను గురించీ, చివరికి కమ్యూనిజం మౌలిక భావాలను గురించీ తెలియజెప్పింది. నిజానికి మహిళల సమస్య, మహిళా విముక్తి మార్గం గురించిన మార్క్సిస్టు అవగాహనకు కమ్యూనిస్టు పార్టీ కట్టుబాటును తెలిపే తొలి ప్రకటన ఇది.

విచారణ జరిగిన తీరు, ఖైదీల ప్రకటనలకు విస్తారమైన మద్దతు లభించింది. మహాత్మా గాంధీతో సహా అనేకమంది జాతీయ నాయకులు ఖైదీలను సందర్శించి, బ్రిటిష్‌వారికి నిరసన లేఖలు రాశారు. బ్రిటన్‌లో కూడా సౌహార్ద్ర కార్యక్రమాలు జరిగాయి. భారత దేశంలోని అనేక నగరాల్లో సమ్మెలు, నిరసన కార్యక్రమాలు జరిగాయి. న్యాయపోరాటానికి నిధులు సేకరించారు. ఇందులో ప్రముఖ కమ్యూనిస్టు చరిత్ర కారుడు రజ్ని పామీ దత్ ప్రముఖ పాత్ర వహించాడు. ఈయన బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, భారతీయ కమ్యూనిస్టులకు గైడ్ కూడా.



మీరట్ కుట్ర కేసుపై ఆ రోజుల్లో ఇంగ్లాండ్‌లో వర్కర్స్ థియేటర్‌వారు ప్రదర్శించిన నాటకం పోస్టర్

1933లో సెషన్స్ కోర్టు కఠిన శిక్షలు ప్రకటించింది. నిందితుల్లో 16 మందికి వివిధ కాలాల పాటు ప్రవాస శిక్ష వేశారు. మరో 11 మందికి కఠిన కారాగారా శిక్ష విధించారు. శిక్ష పడిన వారంతా అల్హాబాద్ హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. హైకోర్టు తన తీర్పులో "కుట్ర ఆచరణయోగ్యమైనది కాదు, ఇంకా చెప్పాలంటే సాధించడం అసాధ్యం" అని పేర్కొంటూ 11 మందిపై అభియోగాలను కొట్టేసింది. ఇతరులకు శిక్ష తగ్గించింది. నిందితులు అప్పటికే నాలుగేళ్లు జైలులో గడిపారు కనుక 1933 నవంబర్‌లో అందర్నీ విడిచిపెట్టేశారు.

మీరట్ విచారణ బ్రిటిష్ వారు కోరుకున్నట్లు కమ్యూనిస్టులను అంతం చేయకపోగా భారత దేశంలో కమ్యూనిస్టులకు మరింత ఊతం ఇచ్చింది. తరువాతి సంవత్సరాల్లో సంస్థాగతంగానూ, పోరాటాల పరంగానూ శీఘ్ర విస్తరణకు ఒక మెట్టులాగా ఉపయోగపడింది.


## 1930 ముసాయిదా కార్యాచరణ వేదిక

అరెస్టు చేయబడిన కమ్యూనిస్టు నాయకులు జైళ్లలో ఉన్నప్పటికీ బయట పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. 1929 టెక్స్‌టైల్ సమ్మె వంటివి. వార్తా పత్రికల ప్రచురణలు కూడా కొనసాగుతున్నాయి. 1933లో సిపిఐ కలకత్తా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో గణశక్తి ప్రచురణ సంస్థను నెలకొల్పారు. ఈలోగా 1930లో సిపిఐ ఒక ముసాయిదా కార్యాచరణ వేదికను ప్రచురించింది. అది వివిధ సెక్షన్ల ప్రజల సమస్యలను ముందుకు తీసుకువచ్చింది. వీటి శాశ్వత పరిష్కారానికి విప్లవ పరివర్తన అవసరం అని పేర్కొంది. అది భారత దేశంలోని విప్లవ పోరాటాన్ని అంతర్జాతీయ కార్మికవర్గ పోరాటంతో సమన్వయం చేసింది. అయితే ఇది జాతీయ సంస్కరణ వాదులకు వ్యతిరేకంగా పోరాడాలన్న అవగాహనను కొనసాగిస్తూ అందువల్ల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటనను తిరస్కరించింది. ఈ పొరపాటు అవగాహన వల్లనే అనేక మంది కమ్యూనిస్టులు ఆ రోజుల్లో ప్రధాన స్రవంతి నుండి వేరుపడిపోయారు.


## తరువాతి తరం కమ్యూనిస్టు నాయకులు

అనేక సంవత్సరాలపాటు తీవ్రమైన పోరాటాలు జరిగిన ఈ కాలం ప్రత్యేకత ఏమంటే, అనేక మంది ఎదిగి వస్తున్న కమ్యూనిస్టు నాయకులు ఈ పోరాటాల్లో పాల్గొన్నారు. జైళ్లకు వెళ్లారు. ఇతర విప్లవ నేతలతో పరిచయాలు ఏర్పరచుకున్నారు. ఆ విధంగా కొత్త తరం కమ్యూనిస్టు నాయకులుగా ఎదిగారు. వారే తరువాతి కాలంలో కీలక పాత్ర నిర్వహించారు. వారిలో ఆంధ్ర ప్రదేశ్‌లో; పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, కంభంపాటి సత్యనారాయణ, కేరళలో; ఇఎంఎస్ నంబూద్రిపాద్,



పుచ్చలపల్లి సుందరయ్య



హరికిషన్ సింగ్ సూర్జిత్


సోహన్ సింగ్ జోష్


బిటి రణదివె


చంద్ర రాజేశ్వరరావు


ఎకె గోపాలన్


ఇఎంఎస్ నంబూద్రిపాద్


ఎస్ఎస్ మీరజ్కర్


అజయ్ కుమార్ ఘోష్

ఎకె గోపాలన్, పి కృష్ణపల్లై, పంజాబ్‌లో; హరికిషన్ సింగ్ సూర్జిత్, సోహన్ సింగ్ జోషి, తమిళనాడులో; జీవానందన్, పి రామమూర్తి, పశ్చిమ బెంగాల్‌లో; బంకిమ్ ముఖర్జీ, అబ్దుల్ రజాక్ ఖాన్, బినయ్ చౌదరి, సోమనాథ్ లాహిరి, భూపేష్ గుప్త, సరోజ్ ముఖర్జీ, బొంబాయిలో; బిటి రణదివే, ఎస్‌జి సర్దేశాయ్, ఈశాన్యరాష్ట్రాల్లో; అజయ్ ఘోష్, పిసి జోషి, జిఎ అధికారి, ఇంద్రవద్ సింగ్, అచింత్య భట్టాచార్య ఇంకా అనేక మంది ఉన్నారు. జ్యోతిబాసు బ్రిటన్‌లో చదువులు ముగించుకుని భారత దేశం వచ్చి 1940లో పార్టీలో చేరారు.

## 1934లో సిపిఐపై నిషేధం

1933లో కలకత్తాలో అఖిల భారత కమ్యూనిస్టుల మహాసభ జరిగింది. మీరట్ కుట్ర కేసులో జైళ్లనుండి విడుదలైన నాయకులు, బయట ఉన్న నాయకులు మహాసభకు హాజరై పరిస్థితులను సమీక్షించారు. మహాసభ ఒక తాత్కాలిక కేంద్ర కమిటీని ఎన్నుకున్నది. ముసాయిదా రాజకీయ విధానపత్రాన్ని కూడా ఆమోదించింది. కేంద్రీకృత పార్టీని నిర్మించాలని అది నొక్కిచెప్పింది. జాతీయ బూర్జువా వర్గానికి సామ్రాజ్యవాదులతో గణనీయమైన వైరుధ్యాలున్నాయని ఆమోదించింది. అంతేకాకుండా దానికి ప్రజల్లో మంచి పట్టు ఉందని కూడా అంగీకరించింది. గతంలో ఈ విషయాలను అంగీకరించేవారు కాదు. దీంతో కొత్త దశ పోరాటాలు ప్రారంభమైనాయి.

కలకత్తా మహాసభ జరిగిన కొద్ది మాసాలకే బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై దాడికి దిగింది. 1934 జులైలో పార్టీపై నిషేధం విధించింది. ఈ నిషేధం ఉన్నప్పటికీ కమ్యూనిస్టులు పార్టీని విస్తరింపజేశారు, అప్పటికే ఉన్న కేంద్రాలను పునర్వ్యవస్థీకరించారు.

## కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ 1934లో పాట్నాలో ఏర్పాటైంది. ఈ మహాసభకు ముందే బొంబాయి, కలకత్తా, కేరళ ఇంకా ఇతర ప్రాంతాల్లో కమ్యూనిస్టులు, సోషలిస్టులు, వామపక్షాల్లోని ఇతర సెక్షన్లు కలిసి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రాంతీయ యూనిట్లు ఏర్పాటు చేశారు. కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్, కృష్ణపిళ్లైలు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పనిలో నాయకత్వ పాత్ర నిర్వహించారు. తమిళనాడు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్టు యోధురాలు కెపి జానకీ అమ్మ, గుజరాత్‌లో దైనిక్ మెహతా ఉండేవారు.

తమది కాంగ్రెస్ పార్టీలోనే పనిచేసే సోషలిస్టుల పార్టీ అనీ, కాంగ్రెస్‌ను సోషలిజం వైపుకు నెట్టడం తమ కర్తవ్యమనీ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తన విధాన ప్రకటనలో పేర్కొంది.

## విస్తృతమైన సామ్రాజ్యవాద–వ్యతిరేక సంఘటన

ఈ సమయంలోనే పార్టీ పనిలో కొత్త పంథా ప్రారంభమైంది. కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే విస్తృతమైన సామ్రాజ్యవాద–వ్యతిరేక సంఘటన నిర్మించడం కోసం కృషి చేయాలని నిర్ణయించారు. "నేషనల్ ఫ్రంట్" అనే పేరుతో ఒక పత్రికను పార్టీ ప్రారంభించింది.

ప్రపంచ వ్యాపితంగా ఫాసిజం తలెత్తడమే ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం. ఈ సవాలును ఎదుర్కోవాలంటే ఐక్య సామ్రాజ్యవాద–వ్యతిరేక సంఘటనను ఏర్పాటు చేయడం అవసరం అని భావించారు. ఇటలీలో ముస్సోలినీ, జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చారు. 1935లో చారిత్రాత్మకమైన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) 7వ మహాసభ జరిగింది. ప్రధాన దేశాల నుండి ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొన్నారు. వారి అనుభవాలను మహాసభ చర్చించింది. జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్ మొదలైన దేశాల్లో ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను కూడా మహాసభ గుర్తించింది. జాతీయ విముక్తి ఉద్యమాలను అది గమనంలోకి తీసుకుంది. ప్రపంచ వ్యాపితంగా ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటన నిర్మించాలని మహాసభ పిలుపునిచ్చింది. అప్పటికి సిపిఐ కొమింటర్న్‌కు అనుబంధంగా ఉంది.

ప్రపంచ వ్యాపితంగా నెలకొన్న ఈ పరిస్థితులను భారత దేశానికి వర్తింపజేయడం జరిగింది. దీని తరువాత అనేక మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలోనూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోనూ ప్రభావశీలమైన నాయకులుగా మారారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అనేది కాంగ్రెస్ పార్టీ లోపల వామపక్షంవైపు మొగ్గే బ్లాకుగా ఉండేది.

# ప్రజాసంఘాల ఏర్పాటు, సాంఘిక సంస్కరణలు

ఇప్పుడు కమ్యూనిసులు కొత్త వ్యూహాన్ని ఆయుధంగా ధరించారు. మరింత వ్యవస్థీకృతమైన, క్రమశిక్షణాయుతమైన పార్టీ వారికి ఉంది. ఇటువంట పరిస్థితుల్లో వారు విభిన్న రంగాల్లో విస్తృతమైన కృషి చేయడానికి దిగారు. మరోపైపు ప్రపంచ వ్యాపితంగా యుద్ధ మేఘాలు కమ్ముకొస్తుండగా, సైనికీకరణ జరుగుతుండగా కమ్యూనిస్టుల ప్రధాన పాత్రనిర్వహించే ప్రజా పోరాటాలు వెల్లువెత్తాయి.

1936లో రెండు ముఖ్యమైన సంఘాలు నిర్మించబడ్డాయి. అవి అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్).

## అఖిల భారత కిసాన్ సభ

కమ్యూనిస్టుల కార్యకలాపాలు, వామపక్షాల ఎదుగుదల రైతాంగం మీద పెద్ద ప్రభావం చూపించింది. రైతులు తమ స్వంత వర్గ సంఘాన్ని నిర్మించుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే దృక్పథంతో పని ప్రారంభించారు. రైతులను కిసాన్ సభలోకి సమీకరించ వారి సమస్యలపై కృషి చేయడంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన ఉన్నారు. 1936లో అఖిల భారత కిసాన్ ఏర్పడక ముందే అనేక రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి సంఘాలు ఏర్పడ్డాయి. ఈ దశలో బీహార్, బెంగాల్, పంజాబ్, సింధ్, ఆంధ్ర, మలబార్ (కేరళ), సుర్మా వాలీ (అస్సాం) మొదలైన చోట్ల తీవ్రమైన పన్నుల భారానికీ, అణచివేతకూ వ్యతిరేకంగా బ్రహ్మాండమైన రైతాంగ పోరాటాలు జరిగాయి. ఈ రైతాంగా పోరాటాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య పాత్ర పోషించారు. రైతాంగాన్ని సమీకరించి, వారి పోరాటాలు నిర్మించడంలో కమ్యూనిస్టు నాయకులు సోషలిస్టులతో చేయి కలిపి పనిచేశారు.

'ఆర్థిక దోపిడీ నుండి రైతాంగాన్ని విముక్తి చేయడం, రైతులు, కార్మికులు ఇతర పీడిత ప్రజలకు ఆర్థిక రాజకీయాధికారం సాధించిపెట్టడం' తన కర్తవ్యం అని అఖిల భారత కిసాన్ సభ వ్యవస్థాపక మహాసభ నిర్దేశించుకున్నది. మహాసభ తొలి అధ్యక్షుడుగా స్వామి సహజానంద సరస్వతినీ, ప్రధాన కార్యదర్శిగా సోషిలిస్టు ఎన్‌జి రంగాను ఎన్నుకున్నది. మహాసభ రెండు ముఖ్యమైన తీర్మానాలు కూడా ఆమోదించింది. మొదటిది, అన్ని రూపాల్లో ఉన్న భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి, దున్నే రైతులకు భూమి మీద యాజమాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ. రెండవది, రైత్వారీ ప్రాంతాల్లో భూమి శిస్తు విధానాన్ని సంపూర్ణంగా మార్పుచేయాలనీ, పేద రైతులకు శిస్తు రద్దు చేస్తూ క్రమానుగతమైన శిస్తు పద్ధతి ప్రవేశపెట్టాలనేది రెండవ డిమాండు. ఈ లక్ష్యాలు, తీర్మానాలు ప్రవేశపెట్టడానికి కారణం స్పష్టంగా కమ్యూనిస్టుల, సోషలిస్టు భావాల ప్రభావం పెరగడమే. కార్మిక–రైతాంగ సంఘటనను నిర్మించడం ద్వారా మాత్రమే సామ్రాజ్యవాద–వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేసే సామర్థ్యం కార్మికవర్గానికి వస్తుందన్న వ్యూహంతో కమ్యూనిస్టులు ఈ విధంగా పనిచేశారు.

**అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్**

విభిన్న రాజకీయ స్రవంతులకు చెందిన అన్ని సెక్షన్ల విద్యార్థులు ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారు. ఈ సంఘం మొదటి మహాసభను 1936లో జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారు.

రష్యా విప్లవ సాహిత్యం, సోషలిజం సాధించిన విజయాలు, భగత్ సింగ్ వంటి భారతీయ విప్లవకారుల కార్యకలాపాలు యువకుల మీద బ్రహ్మాండమైన ప్రభావం చూపించాయి. కమ్యూనిస్టుల ప్రభావాన్ని క్రమంగా కాంగ్రెస్ పార్టీ అంగీకరించింది. ఇది బ్రిటిష్ వారిని ఆందోళనకు గురిచేసింది.

1936లో ఎఐఎస్‌ఎఫ్ ఏర్పడకముందే కమ్యూనిస్టులు జిల్లా, రాష్ట్ర స్థాయి సంఘాల ద్వారా విద్యార్థి, యువజనులను సమీకరించేవారు.

పంజాబ్ ప్రాంతంలో భగత్ సింగ్ ఆయన సహచరులు ప్రారంభించిన నౌజవాన్ భారత్ సభ విద్యార్థి, యువకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించింది.

1935లో మద్రాస్ ప్రెసిడెన్సీలో సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా రాడికల్ యువజన మహాసభ జరిగింది. ఆంధ్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, మద్రాస్ నగరాల్లో ప్రాంతీయ లీగులు ఏర్పాటు చేయడం కోసం మహాసభలో కమిటీలు ఏర్పాటు చేశారు. దీన్ని గురించి హోమ్ శాఖ నివేదికలు తమ బలగాలకు హెచ్చరికలు జారీచేశాయి. 'మద్రాస్ ప్రెసిడెన్సీలో అనేకమంది విద్యార్థులనుండి గణనీయమైన కమ్యూనిస్టు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది' అని నివేదికలో పేర్కొన్నారు.

అమీర్ హైదర్ ఖాన్ యువ కార్మిక సంఘాన్ని స్థాపించారు. మద్రాస్‌లో పుచ్చలపల్లి సుందరయ్య సోదర సమితిని ఏర్పాటు చేసి విద్యార్థి, యువజనులను సమీకరించనారంభించారు. ఆ తరువాత ఆయన 1935లో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు.


శాంతి ఘోష్

చంద్ర రాజేశ్వరరావు ఆయన తోటి కామ్రేడ్స్ 1931లో బెనారస్ యూనివర్సిటీలో యంగ్ కమ్యూనిస్టు లీగ్‌ను స్థాపించారు. వాళ్లు ఆ యూనివర్సిటీలో నిత్యం స్టడీ సర్కిల్స్ నిర్వహించేవారు. వ్యాయామ శిక్షణ కూడా ఇచ్చేవారు. అనేక సందర్భాల్లో వారు ఆర్ఎస్ఎస్‌తోనూ, దాని మతోన్మాద రాజకీయాలతోనూ ఢీ అంటే ఢీ అని ఎదుర్కొనేవారు.


లీలా రాయ్

1939లో ప్రత్యేకంగా విద్యార్థినుల కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులను సమీకరించడం మరో ముఖ్యమైన ముందడుగు. కల్పనా దత్ తోపాటు కనక్ దాస్‌గుప్త (తరువాత ముఖర్జీ) విద్యార్థినుల కమిటీలో నాయకత్వంలో ఉండేవారు.


బీనాదాస్ భౌమిక్

ఎఐఎస్ఎఫ్ దృక్పథం, విధానాలు సాధారణంగా సామ్రాజ్యవాద–వ్యతిరేకతను ప్రతిఫలించేవి. సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతంతో ప్రభావితమయ్యేవి. సంపూర్ణ స్వరాజ్యం డిమాండ్‌తోపాటు విద్యార్థులెదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు డిమాండ్ చేసేవారు. ఆటలు, స్టడీ క్లాసులు, రాత్రి పాఠశాలలు, లైబ్రరీలు, వార్షికోత్సవాల నిర్వహణ, వాలంటీరు దళాలు, విద్యాభివృద్ధి వంటి విద్యార్థి సమస్యలపైనా, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో పాటు షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల హక్కుల కోసం పోరాడటం కూడా వారి కార్యకలాపాల్లో ప్రధానంగా ఉండేవి.


సునీతి చౌదరి

## మహిళా సంఘాల ఏర్పాటు

ఈ కాలంలో అనేకమంది మహిళా విప్లవ కారిణులు పార్టీలో చేరారు. మహిళలు అసంఖ్యాకంగా జాతీయోద్యమంలో చేరడానికి గాంధీ కారణం. జాతీయోద్యమంలో వారు అనేక త్యాగాలు చేశారు. పోలీసుల లాఠీలు, తూటాలు ఎదుర్కొన్నారు. అదే సమయంలో కార్మికులు, రైతులు, యువజనుల వర్గపోరాటాల్లో

కూడా మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారిలో మొదటివాళ్లలో ఒకరు సంతోష్ కుమారి దేవి. ఆమె బెంగాల్ జనపనార కార్మికులను సమీకరించి 1920లో ఎఐటియుసి ఏర్పడిన వెంటనే దాని నాయకురాలైనారు. తొలితరం మహిళా కమ్యూనిస్టు నాయకులంతా ఈ పోరాటాల స్ఫూర్తి పొందినవారే. వీరేంద్రనాథ్ చెల్లెలైన సుహాసినీ చటోపాధ్యాయ 1930లో ఇందులో చేరిన తొలి కమ్యూనిస్టు అని చెబుతారు. అనేక సాయుధ గ్రూపుల్లో యోధురాళ్లయిన వారు కూడా పార్టీలో చేరారు. వారిలో కల్పనా దత్, శాంతి ఘోష్, సునితి చౌదరి, బీనా దాస్ ఉన్నారు. ముప్పయివ దశకం, నలభైవ దశకం ప్రారంభంలో కమ్యూనిస్టు ఆశయాలతో స్ఫూర్తి పొందిన అనేక మంది మహిళలు వివిధ రాష్ట్రాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు చేశారు. 'రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి' అని మహిళా కమ్యూనిస్టులు చేపట్టిన ఉద్యమానికి ప్రజలనుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది.


వామపక్ష, మహిళా నేతలు డా॥ ప్రభాబతి, రంగ (కింద) కమలా దేవి, సుహాసినీ, ప్రతివా దేవి

బెంగాల్‌లో ఆత్మ రక్షా సమితి, పంజాబ్‌లో మహిళల ఆత్మ రక్షణ లీగు, కేరళలో మహిళా సంఘం ఏర్పడ్డాయి. కేరళలో నంబూద్రీలు, ఎజ్వాలు, దళిత కులాల్లో కులవ్యతిరేక ఉద్యమాలు జరిగాయి. ఈ ఉద్యమాల్లో అనేక మంది మహిళలు చైతన్యం పొందారు. వారు తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కమ్యూనిస్టులు నడిపే రాజకీయ తరగతుల్లో అనేక మంది విద్యార్థినులు, మహిళలు కూడా పాల్గొనేవారు. వారిలో చాలా మంది మహిళా సంఘాల ఏర్పాటు కృషి చేశారు. తమిళనాడులో జననాయక మధర్ సంఘాలు ఏర్పాడ్డాయి. మహరాష్ట్రలో కూడా స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మహిళా సమస్యలపై వారిని సమీకరించారు.

అన్ని మతాల నుండి, కులాల నుండి మహిళలు పార్టీలో చేరారు. పార్టీ రహస్యంగా పనిచేసిన కాలాల్లోనూ, లేదా దానిపై నిషేధం ఉన్న సుదీర్ఘ కాలాల్లోనూ పార్టీని రక్షించుకోవడంలో మహిళలు వీరోచిత పాత్ర నిర్వహించారు. 1929లో ఏర్పడిన అఖిల భారత మహిళా మహాసభలో కమ్యూనిస్టు మహిళలు కూడా పనిచేశారు.



అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం మహాసభకు హాజరైన ప్రతినిధులలో కొందరు

నలభయ్యవ దశకంలో హిందూ చట్ట సంస్కరణోద్యమంలో కమ్యూనిస్టు మహిళలు చురుకుగా పనిచేశారు.

### అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం)

అత్యంత ప్రతిభావంతులైన మేధావులు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, రచయితలు, కవులు, సాంస్కృతిక కార్యకర్తలు కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. కొందరు జీవితాంతం పార్టీ మద్దతుదారులుగా ఉన్నారు. ఇతరులు కమ్యూనిస్టు పార్టీలో చురుకైన సభ్యులైనారు.

అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అభాఅరసం) 1936లో ఏర్పడింది. ఇదొక విస్తృత ప్రాతిపదిక గల సంఘం. దీన్లో కమ్యూనిస్టు ప్రభావం వేగంగా పెరిగింది. ఐరోపాలో మగ్జీమ్ గోర్కీ ఇతర అభ్యుదయ రచయితల నాయకత్వంలోని ఫాసిస్టు–వ్యతిరేక రచయితల సంఘం స్ఫూర్తితో అరసం ఏర్పడింది. కమ్యూనిస్టుల చొరవతో ఏర్పడిన ఈ సంఘం దేశంలోనే అత్యున్నత రచయితలైన రవీంద్రనాథ్ ఠాగూర్, సరోజినీ నాయుడు, మున్షి ప్రేమ్‌చంద్ వంటి వారి దీవెనలందుకుంది. లక్నోలో జరిగిన మొదటి భారత రచయితల మహాసభకు ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించారు. తరువాత ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ఏర్పడింది. నాటకరంగం, సినిమాల నుండి అత్యున్నత సృజనశీలురు ఇందులో చేరారు. అనేక మంది పేరొందిన నటులు కమ్యూనిస్టు పార్టీ సభ్యులైనారు. దాని

మొదటి ప్రధాన కార్యదర్శి సజ్జద్ జహీర్.

దీంతోబాటు కమ్యూనిస్టు స్త్రీ, పురుషులు అనేక సాంస్కృతిక బృందాలు ఏర్పాటు చేశారు. కార్మికవాడల్లోనూ, గ్రామకూడళ్లలోనూ వారిచ్చే ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకర్షించేవి. ఈ బృందాల్లో అనేకం, సంప్రదాయ జానపద రూపకాలను తీసుకుని విప్లవ వాణిని వినిపించేవి. ఈ రూపకాలు గొప్ప ప్రజాదరణ పొందాయి.

**సంఘ సంస్కరణ: కుల-వ్యతిరేక పోరాటాల్లో కమ్యూనిస్టులు**

భారత దేశంలో కమ్యూనిస్టులు కుల వ్యవస్థనూ, క్రూరమైన కులవివక్షనూ మొదటి నుండీ ఖండించారు. కుల వ్యవస్థ నిర్మూలన భారత వ్యవసాయ విప్లవంలో అంతర్భాగమని చెప్పారు. 1930లో ఏర్పడిన కార్యాచరణ వేదిక అప్పుడే ఏర్పడుతున్న కమ్యూనిస్టు పార్టీ తొలి కార్యక్రమం. అది ఇలా చెప్పింది: "బ్రిటిష్ సామ్రాజ్యవాదం, భూస్వామ్య వ్యవస్థ, అభివృద్ధి నిరోధక కుల వ్యవస్థ, మత మోసకారితనం, గతం నుండి వస్తున్న అన్ని రకాల బానిస, అర్ధబానిస సంప్రదాయాలు భారత ప్రజల అభివృద్ధికీ, వారి విముక్తికీ అడ్డుగోడలుగా నిలిచాయి. వీటి ఫలితంగా 20వ శతాబ్దంలో కూడా తోటి మనుషులతో కలవడానికీ, ఉమ్మడి బావులనుండి నీరుతోడుకోడానికీ, ఉమ్మడి పాఠశాలల్లో చదువుకోడానికీ హక్కులేని వారున్నారు." "బానిసత్వాన్ని, కుల వ్యవస్థనూ, కుల అసమానతలనూ అన్ని రూపాల్లోనూ పూర్తిగా రద్దు చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కట్టుబడి ఉంది" అని కార్యక్రమం పేర్కొంది.

ఈ కాలం మొత్తం లోనూ కమ్యూనిస్టులు పీడనకు గురయ్యే దళితులు, ఆదివాసీలను విభిన్న పోరాటాల్లో ఐక్యం చేయడానికి ఎనలేని కృషి చేశారు. ఫ్యూడల్-వ్యతిరేక లేక పెట్టుబడిదారీ-వ్యతిరేక పోరాటాలు ఏవైనాగానీ లేక బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలుగానీ వాటన్నిటిలో కమ్యూనిస్టులు ఈ కృషి చేశారు. దీంతోబాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టులు ప్రత్యేకంగా కుల-వ్యతిరేక పోరాటాలు చేశారు. గాంధీజీ కులంలోపలనే సంస్కరణలు తేవాలన్న వైఖరితో పనిచేయగా దానికి భిన్నంగా కమ్యూనిస్టులు కులాన్ని నిర్మూలన కోసం పోరాడారు.

**కేరళలో** కమ్యూనిస్టు నాయకులు దళితులకు సమానహక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. అనేక పోరాటాలు స్వయంగా నడిపారు. ఆ రోజుల్లో దళితులకు దేవాలయాల్లోకి ప్రవేశం ఉండేది కాదు. దేశాలయాల్లోకి దళితులకు ప్రవేశించే హక్కు కోసం పోరాడారు. నిజానికి ఇటువంటి సాంఘిక సంస్కరణ ఉద్యమాలద్వారానే వారు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. చారిత్రాత్మకమైన వైకోం పోరాటం ఇందులో ఒకటి. ఎకె గోపాలన్, పి కృష్ణ పిళ్లైలు యువకులుగా ఉన్నప్పుడు గురువాయూరప్ప దేవాలయంలోకి దళితుల ప్రవేశం కోసం సత్యాగ్రహం నడిపారు.

కండోత్‌లో పోరాటాన్ని ఎకె గోపాలన్, కెవి కేరళీయన్‌లు నడిపారు. పళయం రోడ్డు ఆందోళనను కమ్యూనిస్టు పార్టీ నడిపింది. ఇందులో టిఇ బాలన్ ఉన్నారు. కులతత్వ గూండాలు అనేక మంది కమ్యూనిస్టు నాయకుల మీద భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఈ పోరాటాల వల్ల ట్రావన్‌కోర్ పాలకులు1936లో దేశాలయ ప్రవేశ చట్టం తేవాల్సి వచ్చింది. 1939లో కొడ్డకడ్‌లో జరిగిన కిసాన్ సభ మహాసభలో అన్ని కులాలకు చెందిన 15,000 మంది ప్రజలు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు.

**ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమల్లో** కుల వివక్ష వ్యతిరేక పోరాటం కమ్యూనిస్టు ఉద్యమంలో అంతర్భాగంగా ఉండేది. పుచ్చలపల్లి సుందరయ్య గ్రామాల్లో కుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు నడిపారు. గ్రామాల్లో దళిత, దళితేతర వ్యవసాయ కార్మికులకు ఉమ్మడి భోజనాలు ఏర్పాటు చేశారు. ఊరు బావిలో అందరూ కలిసి నీళ్లు తోడుకునేందుకు ఆందోళనలు నిర్వహించారు. గ్రామ పాఠశాల్లో చదువుకోడానికి అనుమతివ్వని దళితుల పిల్లల కోసం, వ్యవసాయ కార్మికుల పిల్లల కోసం ప్రాథమిక పాఠశాలలు, లైబ్రరీలు నిర్వహించారు. దళితులకు దేవాలయాల్లోకి ప్రవేశం ఇవ్వాలనీ, బావులు, చెరువల నుండి నీళ్లు తోడుకోడానికి అనుమతివ్వాలనీ, వారికి శ్మశాన వాటికలు ఉపయోగించుకునే హక్కు కోసం, దళిత పిల్లలను గ్రామ పాఠశాలల్లో చేర్చుకోవాలనీ అనేక పోరాటాలు చేసినట్లు రికార్డులున్నాయి. కమ్యూనిస్టులు వయోజన విద్యా పాఠశాలలు నడిపారు, దళిత విద్యార్థుల కోసం హాస్టళ్లు నిర్వహించారు. శ్రామిక రక్షణ లీగులను విస్తృతంగా ఏర్పాటు చేశారు. ఆ రోజులో కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను "దళిత పార్టీ" అని నిందించేది.

**మహారాష్ట్రలో** ముఖ్యమైన కమ్యూనిస్టు నాయకుడైన ఆర్‌బి మోర్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రారంభించిన రెండు ప్రముఖ ఉద్యమాల్లో ప్రధాన నేతగా పనిచేశారు. వాటిలో ఒకటి 1927 మార్చిలో మహద్‌లో జరిగిన చవ్‌దార్ సరస్సు సత్యాగ్రహం. ఈ సత్యాగ్రహంలో డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో వేలాది మంది దళితులు సరస్సులోకి ప్రవేశించి మంచి నీరు తాగారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో మనుస్మృతిని దగ్ధం చేసిన కార్యక్రమంలో కూడా మోర్ పనిచేశారు. 1930లో డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో నాసిక్‌లో కాలారామ్ మందిర్‌లోకి దళితుల ప్రవేశం కొరకు జరిగిన ఉద్యమంలో కూడా కమ్యూనిస్టులు పాల్గొన్నారు. బొంబాయిలోని బిడిడి చాల్స్ టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలో దళితులకు ప్రత్యేక నీటి కుళాయిల ఏర్పాటుకు వ్యతిరేకంగా, ఉమ్మడి కుళాయిల కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలోని గిర్ని కాంగార్ యూనియన్ (టెక్స్‌టైల్ యూనియన్) ఆందోళన జరిపింది. సుదీర్ఘ ఆందోళన తరువాత

డిమాండును యాజమాన్యం ఆమోదించింది.

కొత్తగా ఎన్నికయిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నల్ల చట్టానికి నిరసనగా 1938 నవంబర్ 7న **బొంబాయిలో** చారిత్రాత్మక కార్మిక వర్గ సమ్మె జరిగింది. ఈ సమ్మె అటు వర్గపోరాటం, ఇటు కుల-వ్యతిరేక పోరాటం రెంటినీ ఎలా కలిపి చేయవచ్చో చూపించింది. ఈ మహా సమ్మెను కమ్యూనిస్టు పార్టీ, డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలోని స్వతంత్ర లేబర్ పార్టీ రెండూ కలిసి నిర్వహించాయి. ఖోటి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా 1938లో బొంబాయి శాసన సభ వరకు జరిగిన ప్రదర్శనలో 10,000 మంది రైతులు పాల్గొన్నారు. కొంకణ్ నుండి బోట్ల మీద వాళ్లు బొంబాయి వచ్చారు. ఈ ప్రదర్శనకు డాక్టర్ అంబేద్కర్‌తోపాటు శామ్‌రావ్ పరులేకర్ నాయకత్వం వహించారు. పరులేకర్ తరువాతి కాలంలోకమ్యూనిస్టు పార్టీ, ఎఐకెఎస్‌లకు ప్రముఖ నాయకుడైనారు.

**తమిళనాడులో** పెరియార్ నాయకత్వంలో జరిగిన ఆత్మగౌరవ ఉద్యమంలో పి. జీవనందన్ చురుకుగా పనిచేశారు. ఆయన తరువాతి కాలంలో రాష్ట్రంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడైనారు. మరో కమ్యూనిస్టు నాయకుడు బి. శ్రీనివాసరావు తంజావూరులో దళిత వ్యవసాయ కార్మికులను సమీకరించి భూస్వామ్య వ్యవస్థ పీడనకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారు.

# రెండవ ప్రపంచ యుద్ధం క్విట్ ఇండియా ఉద్యమం

1939లో ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధం భారత దేశ ప్రజలకు ఎనలేని కష్టాలు తెచ్చింది. యుద్ధ చర్యలకు డబ్బు సమకూర్చడం కోసం వలస పాలకులు ప్రజలపై విపరీతమైన భారాలు మోపారు. సరుకుల అక్రమ నిల్వలు, అవినీతి, నేరమయ విధానాలు అనేక రాష్ట్రాల్లో భయంకరమైన క్షామానికి కారణమయ్యాయి. వాటిలో 1943లో బెంగాల్‌లో వచ్చిన కరువు మహా భయంకరమైనది. ఆకలితో లక్షలాది మంది చనిపోయారు. కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున కరువు నివారణ చర్యలకు దిగారు. ఆకలికి గురైన ప్రజలకు తమకు తోచిన రీతిలో సహాయం అందించారు.

భారత దేశంలోని ఇతర ప్రాంతాల్లో వేతనాల కోతలు, ఆహార కొరత, పెరిగిన పనిభారం మొదలైన వాటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు లేచాయి. ప్రభుత్వం అణచివేతకు పూనుకున్నది. అప్పుడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ పార్టీ ఈ పోరాటాలను నిర్వహించడంలో ముందుండి పని చేసింది. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అవకాశవాద, రాజీ విధానాలను విమర్శిస్తూనే పార్టీ ఈ ఉద్యమాలు నిర్వహించింది.

కమ్యూనిస్టుల చొరవతో బొంబాయి కార్మిక వర్గం యుద్ధానికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడింది. 1939 అక్టోబర్ 2న అది యుద్ధ వ్యతిరేక సమ్మె నిర్వహించింది. ఇందులో 90,000 మంది పాల్గొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇటువంటి సమ్మె జరగడం ఇదే ప్రథమం.

కాంగ్రెస్ పార్టీ మరింత మిలిటెంట్ కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ లోపలనుండి పోరాడుతున్న సుభాష్ చంద్ర బోస్ ఆ సమయంలో ఈ సమ్మెకు పూర్తి మద్దతు

తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో ఇలా పేర్కొన్నారు: "బొంబాయి కార్మికవర్గ చర్యకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఈ సంక్షోభ సమయంలో ఇది ఇతర వర్గాలను చర్యలకు పురిగొల్పుతుంది." బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని, ఈ పోరాటాలను ఇతర కార్మిక, రైతాంగ పోరాటాలతో మమేకం చేయాలని కాంగ్రెస్‌లో ఒక సెక్షన్ కోరుకునేది. ఆ సెక్షన్‌కు సుభాష్ చంద్రబోస్ ప్రాతినిధ్యం వహించేవారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీలో బోస్‌ను బాధలకు గురిచేయడం, గాంధీజీ ఆయనను కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం నుండి తొలగించడం "మన ప్రజల ఐక్యతకు తీవ్రమైన విఘాతం" అని కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది.

కాంగ్రెస్ లోపల విబేధాలు పెరిగినప్పటికీ ప్రజాపోరాటాలు కొనసాగాయి.

బొంబాయిలో టెక్స్‌టైల్ సమ్మె తరువాత 1940 మార్చి 4న డిఎ సమస్యపై 1.75 లక్షల మంది టెక్స్‌టైల్ కార్మికులు సమ్మెకు దిగారు. వారి సమ్మెకు మద్దతుగా మార్చి 10న నగరంలో 3.55 లక్షల మంది కార్మికులు ఒక రోజు సమ్మె జరిపారు. దాంతో దేశ వ్యాపితంగా సమ్మె పోరాటాలు ఊపందుకున్నాయి. కాన్పూర్‌లో 25,000 మంది టెక్స్‌టైల్ కార్మికులు, కలకత్తాలో 20,000 మంది మున్సిపల్ కార్మికులు, బెంగాల్ జనపనార కార్మికులు, దిగ్బాయ్ (అస్సాం)లో ఆయిల్ కార్మికులు, ధన్‌బాద్, దాద్రాల్లో బొగ్గు కార్మికులు, జెమ్‌షెడ్‌పూర్‌లో ఇనుము, ఉక్కు కార్మికులు సమ్మెలకు దిగినవారిలో ఉన్నారు. ఈ సమ్మె పోరాటాల్లో ప్రధానమైన విశేషం ఏమంటే మహిళలు అధికంగా పాల్గొనడం. వారు కార్మికులుగా సమ్మె చేయడమే కాకుండా సమ్మె పోరాటాలకు మద్దతుగా, సమ్మెకు మద్దతు సమీకరించేవారుగా, కార్మికులకు ఉమ్మడి వంటశాలలు నడిపే వారుగా బహుముఖంగా పాల్గొన్నారు.

కేరళలోని కయ్యూరులో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటాన్ని పోలీసులు పైశాచికంగా అణచివేయడానికి పూనుకున్నారు. 1943లో నలుగురు యువ కమ్యూనిస్టులను ఉరి తీశారు.

దీన్ని అవకాశంగా తీసుకుని బ్రిటిష్ పాలకులు పార్టీ మీద తీవ్రమైన దాడికి దిగారు. భారత దేశ రక్షణ నిబంధనల కింద 700 మందిని అరెస్టు చేస్తే అందులో 480 మంది కమ్యూనిస్టులే. పార్టీ పత్రికను నిషేధించారు.

## క్విట్ ఇండియా ఉద్యమం

1941లో యుద్ధం కొత్త మలుపు తీసుకుంది. అప్పటివరకు ఫాసిస్టు జర్మనీ, ఇటలీలు పశ్చిమ ఐరోపా దేశాలను జయించడంలో బిజీగా ఉన్నారు. బ్రిటన్ వంటి ఇతర ఐరోపా దేశాలు వారిని ప్రతిఘటిస్తూ ఉండేవారు. అయితే 1941లో సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడికి దిగడం, పెర్ల్ హార్బర్ తరువాత జపనీయులు అమెరికా

మీద యుద్ధం ప్రకటించడంతో ఫాసిజం ప్రపంచ వ్యాపితంగా విజయం సాధించే ప్రమాదం ముంచుకొచ్చింది. ఫాసిజానికి వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ ఒక కోటగోడలాగా ఉండేది. కష్టజీవుల త్యాగాలతో నిర్మించబడిన ఈ తొలి సోషలిస్టు రాజ్యాన్ని రక్షించుకోవడం ప్రథమ కర్తవ్యమని పార్టీ అభిప్రాయపడింది. అందువల్ల పార్టీ యుద్ధం పట్ల తన వ్యూహాన్ని సమీక్షించుకుంది. దాన్ని 'ప్రజా యుద్ధం'గా ప్రకటించింది. ఈశాన్య భారత దేశంలో జపాన్ దళాల పురోగమనాన్ని ఆపడానికీ, నాజీ దళాలు ఇరాక్‌ను దాటి భారత్‌వైపు వచ్చే అవకాశాలను అడ్డుకునేందుకు బలాలను సమీకరించాల్సి ఉంది. దానికోసం దేశంలో ఒక జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పార్టీ బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. జాతీయోద్యమానికి చెందిన నాయకులందరినీ విడుదల చేయాలని కూడా పార్టీ డిమాండ్ చేసింది. సరిగ్గా ఈ సమయంలో 1942 ఆగస్టులో కాంగ్రెస్ పార్టీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రకటించింది. ఈ కాలంలో చేసిన కొన్ని తప్పిదాలకు మూల్యం చెల్లించాల్సి వచ్చిందని పార్టీ తరువాత ఆమోదించినప్పటికీ ఈ కాలంలో కమ్యూనిస్టులు ప్రజల్లో చురుగ్గా పనిచేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం విషయంలో తీసుకున్న రాజకీయ విధానాన్ని అడ్డుపెట్టుకుని కొందరు పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడానికీ, పార్టీ చేసిన కృషినీ, జాతీయోద్యమంలో పార్టీ చేసిన త్యాగాలను వమ్ము చేయడానికీ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ పిలుపు గురించి అంచనా వేసే స్థలం ఇది కాదు కానీ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా జరిగిన దుష్ప్రచారాన్ని భారత దేశ ప్రజలు నమ్మలేదన్నది మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. అందువల్లనే క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అరుణా అసఫ్ అలీ వంటి ప్రముఖ నాయకులు తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వాస్తవానికి 1942 సెప్టెంబర్ 2న బ్రిటిష్ హోమ్ శాఖ నుండి లండన్‌లోని విదేశాంగ కార్యదర్శికి రాసిన లేఖలో బ్రిటిష్ వారే ఇలా పేర్కొన్నారు:"అనేక మంది సిపిఐ సభ్యుల ప్రవర్తన చూస్తే ఒక విషయం స్పష్టంగా రుజువవుతుంది అదేమంటే, ఆ పార్టీ బ్రిటిష్-వ్యతిరేక విప్లవకారులతో ఏర్పడింది." బ్రిటిష్ ప్రభుత్వం రహస్యంగా వేసిన మరో అంచనా ('భారత దేశంలో కమ్యూనిజం, జాతీయవాదం' అనే ప్రచురణలో పేర్కొనబడింది) 1943 సెప్టెంబర్ 20న ఇలా పేర్కొంది: "ఇది (సిపిఐ) ప్రధానంగా భారత దేశ స్వాతంత్ర్యం కోసం పనిచేస్తున్న జాతీయవాద పార్టీ. అంతర్జాతీయత గురించి నోటిమాటలుగా చెబుతున్నప్పటికీ ఇది బ్రిటిష్ పాలనను కూలదోయడానికి నిశ్చయంతో ఉంది కాబట్టే అనేక మంది సభ్యులు ఇందులోకి ఆకర్షించబడ్డారు."

అంతకు ముందు ఇదే హోమ్ శాఖ ఆర్ఎస్ఎస్ గురించి ఇలా చెప్పింది:

"సంఘ్ సూక్ష్మబుద్ధితో చట్టానికి లోబడి ఉంది. మరీ ముఖ్యంగా అది 1942లో చెలరేగిన అల్లర్లలో పాల్గొనకుండా దూరంగా ఉంది."

**మొదటి పార్టీ మహాసభ, బొంబాయి, 1943**

1942లో పార్టీ మీద నిషేధం ఎత్తివేసిన తరువాత 1943 మే 23 నుండి జూన్ 1 వరకు బొంబాయిలో తొలి పార్టీ మహాసభ జరిగింది. అప్పట్లో పార్టీలో 15,000 మంది సభ్యులున్నారు. వారిలో 700 మంది మహిళలు. పార్టీ సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చి 1944 నాటికి 30,000కు 1946 నాటికి 53,000కు చేరింది.

మొదటి పార్టీ మహాసభకు 139 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 13 మంది మహిళలు. జూన్ 13న వెలువడిన పార్టీ పత్రిక "పీపుల్స్ వార్" ప్రత్యేక సంచిక మహాసభ ప్రతినిధుల పూర్వరంగం గురించి వివరిస్తూ ఇలా పేర్కొంది:"70 శాతం మంది ప్రతినిధులు ఒకసారిగానీ ఇంకా ఎక్కువసార్లు గానీ జైలు జీవితం గడిపారు. వారి మొత్తం జైలు జీవితం లెక్కవేస్తే 411 సంవత్సరాలు అవుతుంది. బాబా సోహన్ సింగ్ అతి దీర్ఘకాలం 27 సంవత్సరాలు జైలు జీవితం గడిపారు." అదీ ఆనాటి పార్టీ ప్రతినిధుల స్ఫూర్తి దాయకమైన రికార్డు.

మహా సభ కేంద్ర కమిటీని ఎన్నుకుంది. పిసి జోషి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహాసభ ముగింపుగా కాంగార్ మైదాన్‌లో జరిగిన ప్రదర్శనలో 25,000 మంది పాల్గొన్నారు. వారిలో ఎక్కువ మంది కార్మికులే.

ఆ విధంగా తాష్కెంట్‌లో చిన్న కమ్యూనిస్టుల గ్రూపుగా ప్రారంభమైనప్పటి నుండి 23 సంవత్సరాల తరువాత తొలి పార్టీ మహా సభ జరిపేనాటికి.. అనేక అణచివేతలు, అరెస్టులు ఎదుర్కొని, కష్టసాధ్యమైన పరిస్థితుల్లో పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ, భారత స్వాతంత్ర్యదోమంలో భాగంగా కార్మిక ప్రజల ఛాంపియన్‌గా ఎదిగింది.

# స్వాతంత్ర్యం వరకు జరిగిన మహత్తర పోరాటాలు

1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగియడం, ఫాసిస్టు జర్మనీ, దాని మిత్రపక్షాలు ఓడిపోవడం, సోవియట్ యూనియన్ విజయం సాధించడంతో ప్రపంచ వ్యాపితంగా ప్రజా ఉద్యమాలు వెల్లువెత్తాయి. చైనా, ఇండో-చైనా (వియత్నాం దాని పొరుగుదేశాలు)లో విప్లవోద్యమాలు ఊపందుకున్నాయి. ఇవి భారత దేశంతో సహా వలస దేశాలన్నిటా కోట్లాదిమంది ప్రజలకు స్ఫూర్తి నిచ్చాయి.

భారత దేశంలో బ్రిటిష్ పాలన అస్తమిస్తున్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ, దాని అనుబంధ సంఘాలు వీరోచిత ప్రజా పోరాటాలు నిర్వహించాయి. రైతుల్లోనూ, కార్మికుల్లోనూ, ఇతర ప్రజానీకంలోనూ అవి ఎంతగా చొచ్చుకుపోయిందీ ఈ పోరాటాలు నిరూపించాయి. సంపూర్ణ విముక్తి కోసం అనుసరించాల్సిన మార్గాన్ని అవి ఎంతో ధైర్యంతో ముందుకు తెచ్చాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఈ చివరి రోజుల్లో కూడా ప్రజా ఉద్యమాలపై దుర్మార్గమైన అణచివేతకు పూనుకున్నది. వేలాది మంది ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారు.

దేశంలో అనేక రైతాంగ ఉద్యమాలు జరిగాయి. బీహార్‌లో బకష్త్ ఉద్యమం; పంజాబ్‌లో కౌలు తగ్గింపుకోసం, నీటి తీరువా పెంపుకు వ్యతిరేకంగా; పాటియాలా తూర్పు పంజాబ్ యూనియన్ (పెప్సు)లో భూ యాజమాన్య హక్కుల కోసం; కేరళలో పంటలో భాగం పెంపుకోసం; ఆంధ్రలో బేదఖళ్లకు వ్యతిరేకంగా ఉత్తర ప్రదేశ్‌లో బటైదార్ల (కౌలుదార్ల) తొలగింపునకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి.

1946లో కార్మిక వర్గ సమ్మెలు కూడా వెల్లువెత్తాయి. ఫిబ్రవరిలో జరిగిన భారత నౌకాదల నావికుల తిరుగుబాటుతో స్ఫూర్తి పొంది మదురై, జబల్పూర్, డెహ్రాడూన్, అల్హాబాద్, ఢిల్లీ, బీహార్‌లోనూ దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ సిపాయిలూ,

పోలీసులు వేతనాల పెంపుకోసం సమ్మెలకు దిగారు. మే నెలలో వాయవ్య రైల్వే కార్మికులు నాలుగు గంటల సమ్మె చేశారు. జులైలో పెద్ద ఎత్తున లక్ష మంది పోస్టల్ కార్మికులు సమ్మె చేశారు. జులై 29న నాలుగు లక్షల మంది పారిశ్రామిక కార్మికులు సౌహార్ద్ర సమ్మె చేశారు. 1945లో 7.47 లక్షల మంది కార్మికులు సమ్మెల్లో పాల్గొంటే 1946కి ఈ సమ్మెల్లో పాల్గొన్న కార్మికుల సంఖ్య రెట్టింపుకన్నా ఎక్కువ పెరిగి 19.6కి చేరుకుంది. కార్మికుల్లో అసంతృప్తి ఎంతగా గూడుకట్టు కుందో, పోరాటానికి వారు ఎంత కృతనిశ్చయులై ఉన్నారో ఇది తెలియజేస్తుంది.



**(పైన) సాయుధ తెలంగాణా పోరాట గెరిల్లా దళాలు**
**(కింద) శిక్షణ పొందుతున్న మహిళా గెరిల్లా దళాలు**

కొన్ని పోరాటాలు విస్తృతిలోనూ, మిలిటెన్సీలోనూ అపూర్వమైన స్థాయికి చేరుకున్నాయి. అవి గతంలో ఎన్నడూ లేని రీతిలో వ్యవసాయ సమస్యలను ముందుకు తీసుకొచ్చాయి. 1947లో బ్రిటిష్ వాళ్లు భారత దేశాన్ని విడిచి వెళ్లడం వెనుక ఈ పోరాటాలు ముఖ్య పాత్ర పోషించాయి. ఈ పోరాటాల్లో యోధాను యోధులు చాలా మంది ఉన్నారు. కానీ వారిలో ప్రత్యేకంగా మేజర్ జైపాల్ సింగ్ గురించి చెప్పుకోవాలి. ఈయన బ్రిటిష్ సైన్యంలో అధికారిగా ఉంటూ స్వాతంత్ర్య సమరయోధులను హతమార్చడానికి బ్రిటిష్ వాళ్లు జరిపిన కుట్రను బయటపెట్టాడు. ఆయన నిజమైన కమ్యూనిస్టు దేశభక్తుడు. రహస్య జీవితంలోకి వెళ్లిన ఆయనను పలు పోరాటాల్లో పోరాట యోధులకు శిక్షణ నిచ్చేందుకు కమ్యూనిస్టు పార్టీ నియమించింది.

తెలంగాణా ప్రజా తిరుగుబాటు (1946–51): తెలంగాణా ప్రాంతంలో 3,000 గ్రామాలు, 30 లక్షల మంది ప్రజలున్న ప్రాంతంలో ఈ తిరుగుబాటు జరిగింది. భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం కమ్యూనిస్టు పార్టీ, కిసాన్ సభ ఈ పోరాటాన్ని ప్రారంభించాయి. ఈ పోరాటం సందర్భంగా దుర్మార్గులైన భూస్వాముల నుండి 10 లక్షల ఎకరాల భూమి స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచారు. నియంత హైదరాబాద్ నిజాం పోరాడుతున్న రైతుల మీదికి తన రజాకార్ సైన్యాన్ని పంపాడు. దీన్ని రైతులు

ప్రతిఘటించారు. 2,000 మంది గెరిల్లా దళాల మద్దతుతో 10,000 మంది గ్రామ మిలటరీ యోధులు నైజాం సైన్యాన్ని ఎదుర్కొన్నారు.

ఈ పోరాటంలో మహిళలు చాలా పెద్ద పాత్ర నిర్వహించారు. భూ ఆక్రమణల్లో పాల్గొన్నారు. రాజకీయ, సైనిక దళాలల్లో పాల్గొనడమే కాదు, నాయకత్వం కూడా వహించారు. కామ్రేడ్స్ మల్లు స్వరాజ్యం, రాములమ్మ, రంగమ్మ, సావిత్రమ్మ, వెంకటమ్మ, లచ్చక్క మొదలైన వారు దళనాయకురాళ్లుగా పనిచేశారు. మహిళలు ఆందోళనకారులుగానే కాకుండా ఆర్గనైజర్లుగా కూడా పనిచేశారు. అణచివేతను, వేధింపులను అత్యాచారాలను అనుభవించారు. లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్లకు వెళ్లారు. అనేక మంది ప్రాణాలు కూడా త్యాగం చేశారు. 18 మాసాల పాటు ఈ ప్రాంతమంతా విముక్తమైంది. ప్రజా కమిటీలచే పరిపాలన నడిచింది.

చివరికి 1947లో బ్రిటిష్ వారి నుండి అధికారం స్వీకరించిన నెహ్రూ ప్రభుత్వం భారత సైన్యాన్ని పంపడంతో పోరాటం ఓడిపోయింది. సైన్యం అతి క్రూరంగా తిరుగుబాటును అణచివేసింది. ఈ మొత్తం కాలంలో 4,000 మంది వరకు కమ్యూనిస్టులు, రైతాంగ కార్యకర్తలను చంపేశారు. వారిలో అనేక మంది మహిళలున్నారు. 10,000 మందిని జైళ్లలో పెట్టారు. వేలాది మందిని కొట్టారు, చిత్రహింసలు పెట్టారు, భయోత్పాతానికి గురిచేశారు. కానీ కమ్యూనిస్టులు తల వొంచలేదు. చివరి వరకు పోరాడారు.

తెలంగాణా పోరాటం వ్యవసాయ సమస్యను ముందుకు తెచ్చింది. భూమికోసం రైతాంగ పోరాట పటిమకు ఉదాహరణగా ఈ పోరాటం నిలిచింది.

తెభాగా పోరాటం (1938–49): ఇది పశ్చిమ బెంగాల్‌లో జోతేదార్లు (జమిందార్లు)పై బర్గాదార్లు (కౌలు రైతులు) వివిధ దశల్లో దశాబ్దం పాటు జరిగిన పోరాటం. ఈ జోతేదార్లు కౌలు రైతులనుండి సగం పంట కౌలు రూపంలో తీసుకునే వారు. వీటితో పాటు ఇతరరత్రా వసూళ్లు చేసేవారు. ఇచ్చిన అప్పులపై 50 శాతం వడ్డీ వసూలు చేసేవారు. వీటికి తోడు పేద బర్గాదార్లు అన్ని విధాలా జోతేదార్ల ఆదేశాలు పాటించాల్సి వచ్చేది. పంట ఉత్పత్తిని మూడు భాగాలు (అందుకే తెభాగా అయింది) చేయాలని ఒక భాగాన్ని కౌలుగా జోతేదార్లకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఎఐకెఎస్ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ పోరాటం పశ్చిమ బెంగాల్‌లోని 13 జిల్లాలకు వ్యాపించింది.


కమ్యూనిస్టులు వర్గ ఐక్యతకోసం ఎంతో దీక్షతో చేసిన కృషి వల్ల ఈ పోరాటంలో హిందూ, ముస్లిం రైతులు భుజంభుజం కలిపి పోరాడారు. బెంగాల్‌లోని ఇతర ప్రాంతాల్లో మత ఘర్షణలు జరుగుతున్నప్పటికీ ఈ పోరాటంలో మత సామరస్యత

వర్ధిల్లింది. మహిళలు పోరాటంలో వీరోచిత పాత్ర నిర్వహించారు. రక్షణ దళాల్లో పనిచేశారు. వార్తాహరు లుగా వ్యవహరించారు. ఇవే కాకుండా జెస్సోర్‌కు చెందిన సరళాబాల పాల్ మాదిరిగా మహిళా బ్రిగేడ్ లను తయారుచేసి పోలీసులను ప్రతిఘటించారు. సంతాలి ప్రాంతా నికి చెందిన ఇలా మిత్రా మాదిరిగా ఒకవైపు భూస్వామ్య గూండాలను ఎదిరిస్తూ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూనే మతఘర్షణలు సృష్టించేవారిని కూడా అడ్డుకున్నారు. ముస్లిం లీగ్ రాష్ట్ర ప్రభుత్వం మద్దతుతో భూస్వాములు ఉద్యమకారులపై విరుచుకు పడేవారు.

వివిధ జిల్లాల్లో జరిగిన 22 పోలీసు కాల్పుల్లో 72 మంది కమ్యూనిస్టు యోధులు మరణించారు. వారిలో హిరణ్మయీ బెనర్జీ, లక్ష్మీయి దాసి, మనోహరమ రాయ్, సరోజిని, కుంతి హల్దార్ తదితర మహిళలున్నారు. 3,000 మందిని అరెస్టు చేశారు. 1949లో మాత్రమే రైతుల డిమాండ్లలో కొన్నిటిని ఆమోదించారు. కౌలుదార్లను తొలగించకుండా తప్పని సరి రిజిస్ట్రేషన్ చేయాలన్న డిమాండు 1979లో వామపక్ష ప్రభుత్వం వచ్చిన తరువాత మాత్రమే నెరవేరింది.

పున్నప్ర-వాయలార్ పోరాటం (1946): కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొబ్బరి నార కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మత్స్య కార్మికులు ఇతర కార్మికవర్గ సెక్షన్లు అల్లపుజ జిల్లాలోని ట్రావన్‌కోర్ సంస్థానం (ఇప్పుడు కేరళలో ఉంది) దివాన్ సర్ సిపి రామస్వామి అయ్యర్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించారు. తమ రాజ్యం భారత దేశంలో విలీనం కాకూడదనీ, అమెరికా తరహా పాలన ప్రవేశపెట్టాలనీ ఆయన ప్రతిపాదించాడు. అనేక సంవత్సరాలుగా దివాణాన్ని అత్యంత నిరంకుశంగా నడపడం, 1939-43 మధ్య వచ్చిన కరువు కార్మిక తిరుగుబాటును ప్రేరేపించాయి.

ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు కొబ్బరి కార్మకులను సమీకరించి అనేక పోరాటాలు నడిపారు. అల్లపుజ జిల్లాలో పోరాటానికి కూడా ఈ మిలిటెంట్ సెక్షన్ నాయకత్వం వహించింది. ప్రజల్లోని ఇతర సెక్షన్లను పోరాటంలోకి సమీకరించింది. కమ్యూనిస్టుల నాయకత్వంలోని


పశ్చిమ బెంగాల్‌లో తెభాగా పోరాట దృశ్యం

కార్మికులకూ సైనిక, పోలీసు దళాలకూ మధ్య అనేక సార్లు ఘర్షణలు జరిగాయి. సైన్యం అనేక సార్లు దాడులు చేసినప్పటికీ కార్మికులు వీరోచితంగా ఎదుర్కొన్నారు. ఆర్మీ, పోలీసు క్యాంపుల మీద ఎదురు దాడి చేశారు. పోలీసుల జరిపిన దాడుల్లో 1,000 మంది కమ్యూనిస్టులు, మిలిటెంట్ కార్మికులు మరణించారు.


పున్నప్ర వాయలార్ కమ్యూనిస్టు నేతలు

త్రిపుర గిరిజన పోరాటం: నాటి మహరాజు గిరిజనులపై సాగించిన క్రూర పాలన, దోపిడీకి వ్యతిరేకంగా త్రిపుర గిరిజనులు సాగించిన పోరాటం గుర్తించదగింది. గిరిజన పోరాట యోధుడు దశరథ్ దేవ్ వర్మ నాయకత్వంలో ఒకవైపు రాజుకు, మరోవైపు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఈ పోరాటం సాగింది. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఇది పునాది వేసింది. త్రిపుర ఉపజాతి గణముక్తి పరిషత్, ఎఐఎఎస్‌లు కలిసి గణ శిక్ష ఆందోళన్ పేరుతో పెద్ద గిరిజనోద్యమాన్ని నిర్మించాయి. భూమినుండి తొలగింపు, క్రూరమైన 'టిటున్' పద్ధతికి వ్యతిరేకంగా ఇంకా ఇతర డిమాండ్లపై ఉద్యమం సాగింది.

వర్లీ తిరుగుబాటు, మహరాష్ట్ర (1945-47): మహరాష్ట్రలోని థానే జిల్లాలో వర్లీ ఆదివాసీలు భూస్వాముల క్రూర దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈ ఉద్యమాన్ని ప్రఖ్యాత కమ్యూనిస్టు మహిళా నాయకురాలు గోదావరి ఫరులేకర్ నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించింది. ఈ ప్రాంతంలో కిసాన్ సభ ఏర్పాటు చేయడం కోసం ఆమె తన భర్త శామ్‌రావ్ ఫరులేకర్‌తో కలిసి ఇక్కడ అనేక సంవత్సరాలు నివసించారు. థానే జిల్లాలో వేలాది మంది ఆదివాసీ స్త్రీ, పురుషులు జరిగిన తిరుగుబాటు దావానలంలా వ్యాపించింది. బానిస దోపిడీకి, వెట్టి చాకిరీ, చాలాతక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు జరిగింది. పోలీసులు తీవ్రమైన అణచివేత సాగించారు. దాన్ని ఆదివాసీలు అంతే వీరోచితంగా ఎదుర్కొన్నారు.

1945 అక్టోబర్ 10వ తేదీన జరిగిన ఒక క్రూరమైన ఘటనలో బ్రిటిష్ వాళ్లతో కుమ్మక్కయిన భూస్వాములు గోదావరి ఫరులేకర్ ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని తప్పుడు సందేశం పంపారు. దాంతో వేలాది మంది ప్రజలు ఎర్రజెండాలు పట్టుకుని పోగైనారు. వాళ్లను చుట్టుముట్టి కాల్పులు జరిపారు. పోలీసులు కాల్పులు

జరుపుతున్నా, తూటాలకు తమవారు నేలకొరుగుతున్నా ఆదివాసీలు వెనకడుగు వేయకుండా 15 గంటల పాటు పోరాడారు. అనేక మంది మరణించారు. ఈ పోరాటం వల్ల భూస్వాములు వేతనాలు



గోదావరి పరులేకర్



వర్లీ ఆదివాసీల సమావేశంలో గోదావరీ పరులేకర్

పెంచాల్సి వచ్చింది. వేధింపులు తగ్గించారు. వారికి భూములు పంచి పెట్టారు.

సుర్మా లోయ పోరాటం (1936–48): ఒక నాటి అస్సాంలో కచార్ నుండి సిల్హెట్ జిల్లా వరకు (ఇప్పుడే సిల్హెట్ బంగ్లాదేశ్‌లో ఉంది) విస్తరించిన సుర్మా లోయలోని కౌలు దారులకు వారు నివసించే, లేక సాగుచేసే భూమిపై హక్కులు ఉండేవి కావు. వాళ్లు పక్కా ఇళ్లు నిర్మించుకోడానికి లేదు. బావి తవ్వుకోడానికి లేదు. చివరికి వారి భూమిలో ఒక చెట్టు కొట్టుకోడానికి కూడా హక్కు ఉండేది కాదు. పండగల్లో కౌలు దార్లు భూస్వాములకు వెట్టి చాకిరీ (నంకార్) చేయాల్సి వచ్చేది. నజరానాలు చెల్లించాల్సి వచ్చేది. చివరికి వారు చెప్పులు ధరించడానికి గానీ, గొడుగు పట్టుకుని బయలకు వెళ్లడానికి గాని అవకాశం ఉండేది కాదు. కమ్యూనిస్టులు చొరవ తీసుకుని 1936లో సుర్మా లోయ కిసాన్ సభను ఏర్పాటు చేశారు. ఆర్థిక దోపిడీకి, సామాజిక పీడనకు వ్యతిరేకంగా పోరాటాలు నడిపారు. భూస్వాములతో కుమ్మక్కయిన ప్రభుత్వం కౌలుదారుల ఇళ్లు కూల్చివేయడానికి ఏనుగులు పంపింది. సాయుధ బలగాలు పంపి రైతులపై తీవ్రమైన దమనకాండ సాగించింది.

1937లో షిల్లాంగ్‌లో అపూర్వమైన నిరసన ప్రదర్శన జరిగింది. వేలాది మంది రైతులు, వెట్టీలు కొండలు గుట్టలు దాటుకుంటూ 86 కిలోమీటర్లు నడిచారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఈ పోరాటాలు మరింత ఉధృతమైనాయి. 1946లో ఇవి పరాకాష్టకు చేరుకున్నాయి. ఈ పోరాటాలపై తెభాగ పోరాట ప్రభావం కూడా ఉంది. పోలీసుల కాల్పులు, దమన కాండలో అనేక మంది కిసాన్‌సభ నాయకులు చనిపోయారు. వారిలో మణిపురి వ్యవసాయ కార్మికురాలు ఇమాచౌ దేవి అనే మహిళ




ఇరాబత్ సింగ్ –


నౌకాదళ తిరుగుబాటు నాయకుడు బలాయ్ దత్

కూడా ఉన్నారు. చివరికి పోరాటాల ఫలితంగా ప్రభుత్వం 1948లో కౌలు రైతుల చట్టం చేయాల్సి వచ్చింది. కౌలు రైతులు చేసిన అనేక డిమాండ్లను ఆమోదించింది.

రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు (1946): బొంబాయిలోని రాయల్ ఇండియన్ నేవీ (ఆర్ఐఎన్) నావికులు 1946 ఫిబ్రవరి 18న సమ్మె చేపట్టారు. మంచి ఆహారం కావాలనీ, పై అధికారుల తిట్టడం మానుకోవాలనే డిమాండ్లతో వారు తొలుత సమ్మెలోకి దిగారు. కాని త్వరలోనే అది రాజకీయ సమ్మెగా మారిపోయింది. నావికులు క్విట్ ఇండియా అని నినాదం చేశారు. ఐఎన్ఎ ఖైదీలతో సహా రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని కోరారు. బ్రిటిష్ వాళ్లు దాడికి వస్తున్నారన్న పుకారు రావడంతో సముద్ర తీరంలో ఉన్న వేలాది మంది నావికులు చేరి విప్లవం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి అనే నినాదాలు చేశారు. వాళ్లలో అనేక మంది నావికులు కాంగ్రెస్ పార్టీ, ముస్లిం లీగ్ జెండాలతో పాటు ఎర్ర జెండాలు కూడా పట్టుకోవడం చూస్తే వారిపై కమ్యూనిస్టు పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

రెండు రోజుల్లోనే సమ్మె రాయల్ ఇండియన్ నావీ మొత్తానికి పాకింది. కరాచీ, కలకత్తా, మద్రాసుల్లోని 74 నౌకలు, 20 తీర స్థావరాల్లో సమ్మె జరిగింది. కమ్యూనిస్టుల స్ఫూర్తితో మొదటి సారిగా సైనిక బలగాలు స్వాతంత్ర్యోద్యమంలోకి దిగాయి. బ్రిటిష్ సైన్యం నౌకాశ్రయాల్లో మోహరించబడింది. వారు ప్రజల మీదా నావికుల మీదా విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. నావికులకు సౌహార్ద్రంగా కార్మికవర్గం, సామాన్య ప్రజలు వీధుల్లోకి వచ్చారు. బొంబాయిలో పెద్ద ప్రదర్శనలు జరిగాయి. అనేక



భారత నౌకాదళ తిరుగుబాటు సందర్భంగా బొంబాయి వీధుల్లో ఒక దృశ్యం



బొంబాయి వీధుల్లో నౌకాదళ తిరుగుబాటు దారులు

చోట్ల వీధి పోరాటాలు జరిగాయి.

నౌకా తిరుగుబాటుకు మద్దతుగా సిపిఐ ఇచ్చిన సాధారణ సమ్మెకు పిలుపునిచ్చింది. నిరసన కారులపై కాల్పులు జరుపుతూ బ్రిటిష్ సైన్యం బొంబాయి వీధుల్లో స్వైరవిహారం చేసింది. 400 మంది చనిపోయారు. ఇన్ని జరిగినా సమ్మె పూర్తిగా విజయవంతమైంది. చనిపో యిన వారిలో అనేక మంది కమ్యూనిస్టులు ఉన్నారు. వారిలో యువ మహిళా కమ్యూనిస్టు కమల్ దండె ఒకరు. పోరాటాన్ని ముందుకు తీసుకుపోడానికి బదులు కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు సమ్మె విరమించాలని నావికులకు పిలుపు నిచ్చాయి.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా, దోపిడీ లేని స్వతంత్ర భారతాన్ని సాధించుకునేందుకు జరుగుతున్న ఉమ్మడి పోరాటంలో భారత ప్రజలు ఒకవైపు ఐక్యమవుతుంటే మరోవైపు హిందూ ముస్లిం మతాలలో ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ, ముస్లిం లీగ్ ప్రజల్లో అతి భయంకరమైన మతఘర్షణలను రెచ్చగొట్టాయి. ఫలితంగా దేశం రక్తపాతంతో రెండుగా విడిపోయింది.

ఈ మూడు మతతత్వ సంస్థల్లో ఒక్కటి కూడా అవి ఏర్పడినప్పటినుండి ఏనాడూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోట్లాడలేదన్నది సుస్పష్టమైన వాస్తవం. ఈ ద్రోహంలో ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభలు అగ్రభాగాన నిలిచాయి. వాటి కార్యకర్త అయిన నాథూరామ్ గాడ్సే, ఆయన అనుచరులు 1948 జనవరి 30 మహాత్మా గాంధీని హత్యచేశారు. అప్పటికి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 6 మాసాలు అయింది.

దీనికి పూర్తి భిన్నంగా కమ్యూనిస్టులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమంలో తీవ్రంగా పోరాడడమే కాక మతసామరస్యాన్ని కాపాడటంలో కూడా చురుకుగా పనిచేశారు. దేశ విభజనకు ముందు తరువాత రెండు మతాలకు చెందిన సామాన్య ప్రజల ప్రాణాలను మారణహోమం నుండి కాపాడటంలో కమ్యూనిస్టులు ఎనలేని చొరవ చూపించారు.

## ముగింపు

చివరికి బ్రిటిష్ వారు 1947 ఆగస్టు 15న దేశాన్ని విడిచిపోతూ కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారు.

భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో నాలుగు వైఖరులు అంతర్భాగంగా ఉన్నాయి. అవి కాంగ్రెస్, కమ్యూనిస్టులు, సాయుధ విప్లవ కారులు, సాంఘిక సంస్కరణవాదులు. అనేక సంవత్సరాలుగా ముఖ్యంగా స్వాతంత్ర్యానికి ముందు కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు బ్రిటిష్ పాలన అంతం కావడానికి దోహదపడింది. దురదృష్ట వశాత్తూ దేశాన్ని విభజించడానికి అంగీకరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వాళ్ల చేతిలో పావుగా మారింది. దీని వల్ల విపరీతమైన ప్రాణ నష్టం జరిగింది.

భారత పాలక వర్గాలకు అధికారం ఇచ్చిన తరువాత కొత్త శకం ప్రారంభమైంది. ప్రధానంగా విదేశీ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన జాతీయ ఐక్య సంఘటన దశ ముగిసింది.

భారత కమ్యూనిస్టులు ప్రారంభం నుండి దేశభక్త చరిత్రను రక్తంతోనూ, పోరాటాలతోనూ లిఖించారు. మంచి భవిష్యత్తు కోసం భారత దేశ కార్మిక ప్రజలను సమీకరించే సవాలను స్వీకరించడం ద్వారా వారు దేశాన్ని వర్గదోపిడీ, సామాజిక పీడన లేని సోషలిస్టు సమాజం వైపు నడిపించే యజ్ఞాన్ని చేపట్టారు.

భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి సంవత్సరం సందర్భంగా ఈ మహత్తర లక్ష్యాల సాధన కోసం మా కృషిని ద్విగుణీకృతం చేస్తామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

**రిఫరెన్స్‌లు:**

సిపిఐ(ఎం) పార్టీ కార్యక్రమం (1964, 2000 సం॥లో తాజాపరచబడింది) సిపిఐ(ఎం) ప్రచురణలు

కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, తొలి సంవత్సరాలు 1920–1933; హరికిషన్ సింగ్ సూర్జిత్, లెఫ్ట్‌వర్డ్ బుక్స్‌తో కలిసి సిపిఐ(ఎం) ప్రచురణలు; 2005

భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ స్థూల చరిత్ర; హరికిషన్ సింగ్ సూర్జిత్, నేషనల్ బుక్ సెంటర్, 1993.

భారత దేశం స్వాతంత్ర్య పోరాట చరిత్ర; ఇఎంఎస్ నంబూద్రిపాద్; సోషల్ సైంటిస్ట్ ప్రెస్, 1986

భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ పత్రాలు, సంపాదకత్వం జ్యోతిబాసు, ప్రచురణ నేషనల్ బుక్ ఏజెన్సీ (వివిధ వాల్యూమ్‌లు)

స్వాతంత్ర్య పోరాట ప్రజా డైరీ, సంపాదకత్వం సీతారామ్ ఏచూరి, పీపుల్స్ డెమోక్రసీ ప్రచురణలు;2008.

రైతాంగ ఉద్యమాలపై ఎఐకెఎస్ స్వర్ణోత్సవ 1936–86 సీరీస్ (8 భాగాలు) ఎఐకెఎస్;1986.

భారత కార్మిక చరిత్ర 1830–1990 సుకోమల్ సేన్; కెపి బగ్చీ అండ్ కో, 1997.

భారత మహిళా ఉద్యమంలో కమ్యూనిస్టులు; రేణు చక్రవర్తి, పిపిహెచ్, న్యూ ఢిల్లీ 1980.

చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి: జ్ఞాపకాలు; సుబోధ్ రాయ్, లెఫ్ట్‌వర్డ్ 2016

అండమాన్స్‌లో భారత బాస్టిల్లె; బిజయ్ కుమార్ సిన్హా, మొదటి ముద్రణ 1939, రెండవ ముద్రణ 1988 పిపిహెచ్

అండమాన్స్‌లో ప్రవాస జీవితాలు; ఆర్‌సి మజుందార్, సంపాదకత్వం పిఎన్ చోప్రా, భారత ప్రభుత్వ ప్రచురణ, 1975

భారత విద్యార్థి ఉద్యమ చరిత్ర; తపస్ బసు, ఎస్ఎఫ్ఐ ప్రచురణలు 1993.

ఆంధ్ర ప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, వైవి కృష్ణారావు, విశాలాంధ్ర ప్రచురణలు 1988

సింగారవేలు– దక్షిణ భారత దేశంలో తొలి కమ్యూనిస్టు; కె. మురుగేశన్, సి.ఎస్. సుబ్రమణ్యం.





ISBN : 978-93-88566-66-7

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్